తెలంగాణ TELANGANA MUCHATLU
# ముచ్చట్లు
TELTEL/2023/88710
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక
వరంగల్ | మంగళవారం-05- ఆగస్టు - 2025 | సంపుటి : 3 | సంచిక : 70 | పేజీలు - 8 | వెల : రూ 5 | www.telanganamuchatlu.in



తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# తెలుగు ఫిల్మ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ కీలక నిర్ణయం

**వేతనం 30శాతం పెంచితేనే షూటింగ్స్**

తెలుగు ఫిల్మ్ ఇండస్ట్రీ ఎంప్లాయిస్ ఫెడరేషన్ కీలక నిర్ణయం తీసుకున్నది. తాము ఆశించినట్టు వేతనాన్ని 30శాతం పెంచిన నిర్మాతల షూటింగులకు మాత్రమే సోమవారం(నేడు) నుంచి కార్మికులు హాజరు కావాలని ఆదివారం ఫెడరేషన్ ఓ ప్రకటన విడుదల చేసింది. సినీ కార్మికుల వేతనాల విషయంపై గత కొన్ని రోజులుగా ఫిల్మ్ ఛాంబర్‌తో ఫిల్మ్ ఫెడరేషన్ చర్చలు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఆదివారం హైదరాబాద్‌లో తెలుగు ఫిల్మ్ ఇండస్ట్రీ ఎంప్లాయిస్ ఫెడరేషన్ సర్వసభ్య సమావేశం జరిగింది. ఇందులో భాగంగా వేతనాల పెంపు విషయంలో పోరాడేందుకు ఓ సమన్వయ కమిటీని ఫెడరేషన్ ఏర్పాటు చేసింది. ఈ కమిటీకి వీరశంకర్, సయ్యర్ హుమయూన్‌లు అధ్యక్షులుగా నియమితులయ్యారు. 30శాతం వేతనాన్ని పెంచేందుకు అభ్యంతరం లేదని తెలిపే సదరు నిర్మాతల ఒప్పంద పత్రాలు ఫెడరేషన్ ద్వారా యూనియన్లకు చేరిన తర్వాతే షూటింగులకు హాజరు కావాలని, అప్పటివరకూ ఫిల్మ్ ఫెడరేషన్ సభ్యులెవరూ సినిమా, వెబ్ సిరీస్‌లకు సంబంధించిన ఎటువంటి విధులకూ హాజరు కాకూడదని ఫెడరేషన్ నిర్ణయించింది. తెలుగు సినిమాల షూటింగులు ఎక్కడ జరిగినా, అంతేకాక ఇతర భాషా చిత్రాలకు పనిచేయాలనుకున్నా కూడా ఈ నిబంధనలు వర్తిస్తాయని ఫెడరేషన్ ప్రకటనలో పేర్కొన్నది. సోమవారం జరగాల్సివున్న అల్లరి నరేష్ కొత్త సినిమా షూటింగ్ ప్రారంభోత్సవం ఫెడరేషన్ నిర్ణయం కారణంగా వాయిదా పడిరది. పరిస్థితులు చక్కబడ్డాక సినిమా షూటింగ్ నిర్వహిస్తామని మేకర్స్ తెలిపారు.



# దేశవ్యాప్తంగా ప్రజలు జేజేలు పలుకుతున్నారు



'నాలుగేళ్ల క్రితం ఈ సినిమాను మొదలుపెట్టి, ఎన్నో వ్యయ ప్రయాసలకోర్చి, పట్టుదలతో మేకర్స్ మనముందుకు తెచ్చారు. నరసింహస్వామి కటాక్షం వల్లే ఇది సాధ్యమైంది. దేశవ్యాప్తంగా ప్రజలు ఈ సినిమాకు జేజేలు పలుకుతున్నారు. ఎప్పుడూ థియేటర్లకు రాని ప్రేక్షకులు సైతం ఈ సినిమాను వీక్షిస్తున్నారు. హైదరాబాద్ ఏఎంబీలో 200మంది స్వాములు ఈ సినిమా చూడటం ఆనందాన్నిచ్చింది. మా కుటుంబంలో సనాతనధర్మం గురించి పవన్‌కల్యాణ్‌కి తెలిసినంతగా ఎవరికీ తెలీదు. ఈ సినిమా చూసి, దీని గురించి ఆయన మాట్లాడాలని ఆశిస్తున్నా.' అని నిర్మాత అల్లు అరవింద్ అన్నారు. అశ్విన్‌కుమార్ దర్శకత్వంలో క్లీమ్ ప్రొడక్షన్స్, హోంబాలే ఫిల్మ్స్ పతాకాలపై శిల్పా ధావన్, కుశాల్ దేశాయ్, చైతన్య దేశాయ్ నిర్మించిన ప్రతిష్టాత్మక వెంచర్ 'మహావతార్ సినిమాటిక్ యూనివర్స్. శ్రీమహావిష్ణువు దశావతారాలకు చెందిన శ్రీమద్‌భాగవతం ఈ యానిమేటెడ్ ఫ్రాంచైజీ ద్వారా దృశ్యమానం కానున్నది. ఇందులో తొలి భాగంగా గత నెల 25న విడుదలైన 'మహావతార్ నరసింహ' ప్రపంచవ్యాప్తంగా అఖండ విజయాన్ని అందుకున్నది. ఈ సందర్భంగా ఆదివారం హైదరాబాద్‌లో నిర్వహించిన సక్సెస్‌మీట్‌లో.. తెలుగులో ఈ సినిమాను విడుదల చేసిన అల్లు అరవింద్ మాట్లాడారు. దీన్ని సినిమాగా కాకుండా, ఓ మహాదర్శనంగా ప్రేక్షకులు భావిస్తున్నారని, ఈ ప్రశంసలన్నీ నరసింహస్వామికే చెందుతాయని, మాతో పాటు అందరికీ డివైన్ ఫీలింగ్ కలిగించిన సినిమా ఇదని, ఈ సినిమాను తెలుగులో విడుదల చేసిన గీతా ఆర్ట్స్ వారికి కృతజ్ఞతలని దర్శకుడు అశ్విన్‌కుమార్ అన్నారు. ఇంకా నిర్మాత శిల్పా ధావన్, తనికెళ్ల భరణి, రచయిత జొన్నవిత్తుల కూడా మాట్లాడారు.

# దిండు మారితే కలత నిద్రే..



శ్రీదేవి ముద్దుల తనయ జాన్వీ కపూర్ ఎక్కడికెళ్లినా తనతోపాటు ఓ దిండుని కూడా తీసుకెళ్తుంటారు. ఈ వ్యవహారం చర్చనీయాంశంగా మారిన సందర్భాలు చాలా ఉన్నాయి. అసలు జాన్వీ తనతోపాటు దిండును తీసుకెళ్లడానికి ఏమైనా ప్రత్యేకమైన కారణాలున్నాయా? అనే అంశంపై పలు కథనాలు కూడా వెలువడ్డాయి. రీసెంట్‌గా ఈ విషయంపై జాన్వీ స్పందించారు. 'నాకు పిల్లో ఫోబియో ఉంది. నా షూటింగులు రకరకాల ప్రదేశాల్లో జరుగుతుంటాయి. ఒక్కోసారి నైట్ అక్కడే స్టే చేయాల్సొస్తుంది. అలాంటి సందర్భాల్లో ఏ దిండు పడితే ఆ దిండును తలకింద వేసుకొని పడుకోలేను. కేవలం నా దిండుపై పడుకుంటేనే నాకు నిద్ర వస్తుంది. దిండు మారితే ఇక ఆ రాత్రంతా కలత నిద్రే. అందుకే తోడుగా దిండు తీసుకెళ్తుంటా. ఈ ఫోబియా నా చిన్నప్పట్నుంచీ ఉంది. ఇందులోంచి బయట పడేందుకు చాలాసార్లు ప్రయత్నించా. ప్రయత్నించిన ప్రతిసారీ నిద్రకు దూరమయ్యా.' అంటూ వాపోయారు జాన్వీ కపూర్. ఇక ఈ స్టేట్‌మెంట్ విన్న నెటిజన్లు.. 'కొత్త దిండు కొనుక్కోవచ్చుగా?', 'నీ ప్రొడ్యూసర్లు కొత్త దిండ్లు కూడా కొనలేరా?' అంటూ కామెంట్లు పెట్టేస్తున్నారు.

# అందరు యాక్టర్లతో కలిసి కనిపిస్తా..!

కూలీలో నా పాత్ర అందరూ యాక్టర్లతో కలిసి సాగుతుంది. చాలా మంది స్టార్లున్న సినిమాలో భాగం కావడం, వారితో స్క్రీన్ షేర్ చేసుకోవడం చాలా థ్రిల్లింగ్‌గా ఉందని చెప్పింది. అంతేకాదు కూలీ ఆసక్తికర కథనంపై ప్రశంసలు కురిపించింది. హై ఆక్టేన్ యాక్షన్ డ్రామా నేపథ్యంలో వస్తోన్న ఈ చిత్రంలో ఆసక్తికరమైన కథలో కీలకంగా సాగేలా ఉండబోతుందన్నది. ఇక లోకేశ్ కనగరాజ్ ఇంటెన్స్ స్టోరీ టెల్లింగ్, తలైవా స్క్రీన్ ప్రెజెంటేషన్ కూలీని బిగ్గెస్ట్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా నిలుపబోతున్నాయని ఇప్పటివరకు వచ్చిన అప్‌డేట్స్ చెబుతున్నాయి. గోల్డ్ అక్రమ రవాణా నేపథ్యంలో వస్తోన్న ఈ చిత్రంలో సత్యరాజ్, మహేంద్రన్, అక్కినేని నాగార్జున, మంజుమ్మెల్ బాయ్స్ ఫేం సౌబిన్ షాహిర్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ మూవీని సన్ పిక్చర్స్ బ్యానర్‌పై కళానిధి మారన్ తెరకెక్కిస్తుండగా.. అనిరుధ్ రవిచందర్ మ్యూజిక్, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడు.





# మొదలైన సంతోషం సంబురాలు

సంతోషం సౌత్ ఇండియన్ ఫిల్మ్ అవార్డ్స్, సంతోషం ఓటీటీ అవార్డ్స్ 2025 కర్టెన్ రైజర్ ఈవెంట్ శనివారం సాయంత్రం హైదరాబాద్‌లో ఘనంగా జరిగింది. సీనియర్ నటుడు మురళీమోహన్, నిర్మాత కేఎస్ రామారావు, కాజా సూర్యనారాయణ, నిర్మాత ఏడిద రాజా ఈ కార్యక్రమంలో అతిథులుగా పాల్గొని 'సంతోషం' పాత్రికాధినేత సురేశ్ కొండేటికి శుభాకాంక్షలు అందించారు. ప్రతి ఏటా ఘనంగా జరిగే సంతోషం అవార్డుల వేడుక ఈ ఏడాది కూడా జనం మెచ్చేలా జరగాలని వారంతా ఆకాక్షించారు. 24ఏండ్లుగా అవార్డుల వేడుకను నిర్వహిస్తున్న ఏకైక మేగజైన్ 'సంతోషం'అని, సురేష్ కొండేటి ఎంతో కష్టానష్టాలకోర్చి ఈ పత్రికను ముందుకు తీసుకెళ్లడమే కాక, అవార్డు వేడుకలను కూడా అద్భుతంగా నిర్వహిస్తున్నారని మురళీమోహన్ కొనియాడారు. సురేశ్ కొండేటి మాట్లాడుతూ '35ఏండ్లుగా జర్నలిస్ట్‌గా ఉన్నాను. విలువలతో పత్రిక పెట్టి, పలువురు హర్షించేలా ముందుకెళ్తున్నాను. ఇక ముందు కూడా ఈ విలువలను వదులుకోను. పరిశ్రమ మెచ్చేలా వేడుక నిర్వహిస్తాం' అని సురేశ్ కొండేటి అన్నారు.

# తమిళ స్టార్ దర్శకులంతా ఒకే ఫ్రేమ్‌లో.. నెట్టింట వైరల్‌గా మారిన పిక్




ఇటీవల సినీ పరిశ్రమలో రీ యూనియన్ ట్రెండ్ బాగా హైలైట్ అయింది. సీనియర్ నటీనటులు, దర్శకులు కలిసి గత జ్ఞాపకాలను పునరుద్ఘాటిస్తూ ఆనందంగా గడిపేస్తున్నారు. ఇటీవల 90ల కాలంలో సూపర్ హిట్స్ అందించిన తమిళ్, తెలుగు నటీనటులు కలిసి రీ యూనియన్ పార్టీ చేసుకున్న సంగతి మనకు తెలిసిందే. తాజాగా, తమిళ్ సినీ పరిశ్రమకు వెలకట్టలేని కృషి చేసిన దర్శకులు ఒకే చోట సమావేశమై ఒక ఫోటో కోసం పోజ్ ఇవ్వగా, ఆ చిత్రాన్ని దర్శకుడు గౌతమ్ వాసుదేవ్ మీనన్ తన సోషల్ మీడియా ఖాతా ద్వారా షేర్ చేశారు. ఈ ఫోటో ఇప్పుడు నెట్టింట వైరల్ అవుతోంది. ఫోటోలో గౌతమ్ వాసుదేవ్ మీనన్, నెల్సన్ దిలీప్ కుమార్ (ఈ జెనరేషన్‌కు బాగా పరిచితమైన దర్శకుడు), శంకర్ (విజువల్ వండర్స్‌కు కేరాఫ్ అడ్రస్), మణిరత్నం (క్లాసికల్ మాస్టర్‌పీసులకు మారుపేరు), మిస్కిన్ (ఇంటెన్స్ నరేషన్‌కి పేరుగాంచిన దర్శకుడు), లింగుస్వామి (కమర్షియల్ హిట్‌లకు స్పెషలిస్ట్), మురుగదాస్ (పాన్ ఇండియా విజయాల కారకుడు), కేఎస్ రవికుమార్ (సినిమా మాస్టర్, స్టార్ హీరోల ఫేవరెట్ డైరెక్టర్) అందరు కూర్చొని ఫొటోకి పోజులిచ్చారు. ఈ ఫోటో సోషల్ మీడియాలో షేర్ చేసిన క్షణాల్లోనే వైరల్ అవగా, తమిళ్ ప్రేక్షకులతో పాటు తెలుగు సినీ ప్రేమికులు కూడా వీరందరు ఇలా కలవడం చూసి సంతోషం వ్యక్తం చేస్తున్నారు. "అందరూ కలిసి ఒకే ఫ్రేమ్‌లో ఉండడం అరుదైన సన్నివేశం", "ఈ ఒక్క ఫోటోలో సుమారు 100 బ్లాక్‌బస్టర్లు దాగున్నాయ్" అంటూ నెటిజన్లు కామెంట్లు చేస్తున్నారు.ఈ రీ యూనియన్ పార్టీ ఎక్కడ జరిగింది? ఎందుకు సమావేశమయ్యారు అన్నదానిపై స్పష్టత రాకపోయినా, ఈ తరహా మీటింగ్‌లు టాలెంటెడ్ మేకర్స్ మధ్య బంధాన్ని బలపరిచే అవకాశం కల్పిస్తాయన్నది మాత్రం స్పష్టంగా అర్థమవుతుంది.. సినిమా ప్రేమికులకు ఇది నిజంగా ఒక విజువల్ ట్రీట్.

# ఓ యువతా నీ గమ్యం ఎటువైపు..?



మాదక ద్రవ్యాల కోరల్లో చిక్కుకొని, పెడదోవ పడుతున్న యువతను సరైన మార్గంలోకి తెచ్చేందుకు హీరో కృష్ణసాయి చేస్తున్న చిరు ప్రయత్నమే 'డేంజర్'. పి.ఎస్.నారాయణ దర్శకుడు. కృష్ణసాయి, పూజిత, మేక రామకృష్ణ, రమేష్ గుత్తుల, నితిష్, వెంకటేశ్వరరావు ప్రధాన పాత్రధారులు. ఈ సినిమా షూటింగ్ త్వరలో మొదలు కానుంది. ఈ సందర్భంగా ఈ సినిమా సంకల్పానికి అద్దం పడుతూ రూపొందించిన 'ఓ యువతా నీ గమ్యం ఎటువైపు?' అంటూ సాగే గీతాన్ని మేకర్స్ ఇటీవల విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆదివారం హైదరాబాద్ ఫిల్మ్ ఛాంబర్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో హీరో కృష్ణసాయి మాట్లాడుతూ 'సినిమా మాధ్యమం వల్ల ప్రజలు ప్రభావితం అవుతారు. ప్రతి సినిమాకూ ముందు 'ధూమపానం ఆరోగ్యానికి హానికరం' అని హెచ్చరికలు చేయడం వల్ల పుగాకు వినియోగం చాలావరకూ తగ్గింది. అందుకే డ్రగ్స్‌పై అవగాహన పెంచేందుకు ఈ గీతాన్ని రూపొందించాం. అందరికీ నచ్చిన ఈ గీతం, మేం తీయనున్న 'డేంజర్' సినిమాలో భాగం కానుంది.' అని తెలిపారు.

# అతడే మీ చెత్త శత్రువు : రామ్ గోపాల్ వర్మ



**`వివాదాస్పద దర్శకుడు రామ్ గోపాల్ వర్మ గురించి తెలుగు ప్రేక్షకులకు ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ఎక్కడ వివాదం ఉందో అక్కడ నేనున్నా అంటూ ఉండే వర్మ ఈమధ్యకాలంలో చాలా సైలెంట్ అయ్యాడు. అంతకుముందులా సోషల్ మీడియాలో కూడా యాక్టివ్ గా కనిపించడం లేదు. పవన్ కళ్యాణ్, చంద్రబాబు నాయుడులపై అనుచిత వ్యాఖ్యలు చేసిన కారణంగా కోర్టులు, కేసులు అని తిరిగాడు. అప్పటి నుంచి కొంచెం ఆచితూచి మాట్లాడుతూ సైలెంట్ గా ఉంటున్నాడు. ఇక ఇవన్నీ పక్కన పెడితే.. ప్రతి పండగకు వర్మ తనదైన రీతిలో ప్రజలకు శుభాకాంక్షలు చెప్పకొస్తాడు. ఇక నేడు స్నేహితుల దినోత్సవం అన్న విషయం అందరికీ తెల్సిందే. నెటిజన్స్ తో పాటు సినీ సెలబ్రిటీలు కూడా ఉదయం నుంచి స్నేహం యొక్క గొప్పతనం గురించి సోషల్ మీడియాలో చెప్పకొస్తూనే ఉన్నారు. తాజాగా వర్మ కూడా ఫ్రెండ్షిప్ డే గురించి తనదైన రీతిలో చెప్పకొచ్చాడు. అయితే హ్యాపీ అని కాకుండా అన్ హ్యాపీ అని చెప్పకొచ్చి షాక్ ఇచ్చాడు. సమాజంలో ఇప్పుడున్న స్నేహం ఎలా ఉందో నిజం చెప్పకొచ్చాడు వర్మ. స్నేహితులు.. మోసగాళ్లు ఒకటే అని చెప్పకొస్తూ వరుస పోస్టులు పెట్టుకొచ్చాడు. 'స్నేహితుడు పొడిచినంత వెన్నుపోటు శత్రువులు కూడా పొడవలేరు'. 'స్నేహితుడికి సహాయం చేయడంలో సమస్య ఏంటంటే.. మొదటిసారి సహాయం చేసావని రెండోసారి వచ్చినప్పుడు సహాయం చేయకపోతే .. అతడే నీకు అతిపెద్ద చెత్త శత్రువు అవుతాడు'. 'మీ రహస్యాలన్నింటినీ బయటపెట్టే వారు ఎల్లప్పుడూ మీకు అత్యంత సన్నిహితులుగా ఉంటారు'. 'స్నేహితులు మిమ్మల్ని ఆత్మసంతృప్తి చెందిస్తారు మరియు శత్రువులు మిమ్మల్ని అప్రమత్తంగా ఉంచుతారు' అంటూ రాసుకొచ్చాడు. చివర్లో హ్యాపీ అన్ ఫ్రెండ్షిప్ డే అంటూ రాసుకొచ్చాడు. ప్రస్తుతం ఈ పోస్టులు నెట్టింట వైరల్ గా మారాయి. ఇక ఈ పోస్టులు చూసిన నెటిజన్స్.. వర్మ చెప్పింది అక్షరాలా నిజం అని కామెంట్స్ చేస్తున్నారు.**

తెలంగాణ
TELANGANA MUCHATLU
TELTEL/2023/88710
ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక
వరంగల్ | మంగళవారం-05- ఆగస్టు - 2025 | సంపుటి : 3 | సంచిక : 70 | పేజీలు - 8 | వెల : రూ 5 | www.telanganamuchatlu.in





# కాళేశ్వరం నిర్మాణ, నిర్వహణలో తీవ్ర లోపాలు

**రాజకీయ జోక్యం లేని కమిషన్ నివేదిక**
**మంత్రివర్గ సమావేశంలో నివేదిక ఆమోదం**

- ఎన్నికల హామీ మేరకు విచారణ
- 16 నెలల పరిశీలన, 665 పేజీల నివేదిక
- శాసనసభలో నివేదికపై విస్తృత చర్చ
- బీఆర్ఎస్ నేతలకు నోటీసులు, వాదనలు వినిపించే అవకాశం
- నిపుణుల నివేదికలతో ఘోష్ కమిషన్‌కు బలం
- కాంగ్రెస్ నేతల పరిశీలనలో తేలిన అవకతవకలు
- నివేదికలపై బీఆర్ఎస్ నాయకుల ద్వంద్వ ధోరణి

హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)

కాళేశ్వరం ప్రాజెక్టు అవకతవకలపై జస్టిస్ పినాకి చంద్రఘోష్ కమిషన్ ఇచ్చిన నివేదికలో ఎలాంటి రాజకీయ జోక్యం లేదని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. ఈ నివేదికను అసెంబ్లీలోపెట్టి చర్చించి, అందరి అభిప్రాయాలు తీసుకున్న తరువాత ఎలాంటి చర్యలు తీసుకోవాలో నిర్ణయిస్తామని చెప్పారు. ఇది స్వతంత్ర కమిషన్ ఇచ్చిన నివేదిక అని, సిఫార్సుల ఆధారంగా చర్యలు ఉంటాయి తప్ప.. ఎలాంటి కక్షపూరిత చర్యలకు తావులేదని రేవంత్‌రెడ్డి తెలిపారు. కమిషన్ ఇచ్చిన నివేదికపై నీటిపారుదల, న్యాయ, సాధారణ పరిపాలన శాఖలకు చెందిన ముగ్గురు కార్యదర్శులతో కమిటీ వేసి, సంక్షిప్త నివేదిక రూపొందించినట్లు చెప్పారు. సోమవారం రాష్ట్ర సచివాలయంలో జరిగిన మంత్రివర్గ సమావేశంలో కమిషన్ నివేదికపై కూలంకషంగా చర్చించి ఆమోదం తెలిపింది. అనంతరం రేవంత్‌రెడ్డి..

మిగతా 4లో

# తప్పు మొత్తం కేసీఆర్ దే..

- కేసీఆర్ అధికారంలో ఉన్నప్పుడే మేడిగడ్డ కూలిపోయింది
- గత ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్ట్ కోసం అధిక వడ్డీలతో రూ.84వేల కోట్లు అప్పు తెచ్చింది
- 16 లక్షల ఎకరాలకు నీరు ఇచ్చేలా డిజైన్ చేశారు కానీ..
- కేసీఆర్ సీఎం అయ్యాక ఇష్టానుసారంగా డిజైన్లు మార్చేశారు
- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి



4లో

# హైదరాబాద్‌లో వర్ష బీభత్సం

**ఒక్క గంటలోనే 7 సెంటీమీటర్ల వర్షపాతం**
**వాహనాలపై కూలిన భారీ వృక్షం**

హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)

హైదరాబాద్‌లో భారీ వర్షం బీభత్సం సృష్టించింది. కుండపోత వాన కురిసింది. ఒక్క గంటలోనే 7 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. పలు ప్రాంతాల్లో రోడ్లన్నీ జలమయం అయ్యాయి. బంజారాహిల్స్ రోడ్ నెం.1లో వాహనాలపై భారీ చెట్టు కూలిపోయింది. పలు వాహనాలు ధ్వంసం అయ్యాయి. దీంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడిరది. ఉప్పల్, రామంతపూర్, నాచారం, తార్నాక, పంజాగుట్ట, బంజారాహిల్స్, జూబ్లీహిల్స్‌లో భారీ వర్షం దంచికొట్టింది. గంటకు 30 నుంచి 40 కి.మీ.వేగంతో గాలులు వీచాయి.

5లో





# కాళేశ్వరం నివేదికపై ఆరోపణలు




**బీఆర్ఎస్ పార్టీ సంచలన నిర్ణయం**

హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)

కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై ప్రభుత్వానికి జస్టిస్ పీసీ ఘోష్ అందించిన నివేదికతో తెలంగాణ రాష్ట్రంలో రాజకీయం వేడెక్కింది. ఈ నివేదికపై ముగ్గుర ఉన్నతాధికారులతో ప్రభుత్వం కమిషన్ ఏర్పాటు చేసింది. ఈ కమిషన్ సైతం తన నివేదికను సోమవారం జరిగిన కేబినెట్ ముందు ఉంచింది. దీంతో రాష్ట్ర రాజకీయం మరింత వేడెక్కింది. అయితే ఈ రెండు నివేదికల్లో బీఆర్ఎస్ పార్టీ చీఫ్, మాజీ సీఎం కేసీఆర్ పేరు పేరు అత్యధిక సార్లు పేర్కొన్నారు.

4లో



# తెలంగాణ బీజేపీ అధ్యక్షుడి కీలక ప్రకటన!

- 42 శాతం రిజర్వేషన్లు పూర్తిగా బీసీలకే ఇస్తామంటే మద్దతిస్తామని స్పష్టీకరణ
- 10 శాతం రిజర్వేషన్లు ముస్లింలకు ఇస్తే బీసీలకు అన్యాయం జరుగుతుందన్న రామచందర్ రావు
- బీసీ రిజర్వేషన్లు ఇవ్వడం కాంగ్రెస్‌కు ఇష్టం లేదన్న రామచందర్ రావు

4లో

# కాళేశ్వరం, ఫోన్ ట్యాపింగ్‌పై ఎవరూ తప్పించుకోలేరు

- కాళేశ్వరం ప్రాజెక్టు ఇంజినీర్ల వద్దే కోట్లు దొరుకుతున్నాయన్న కోమటిరెడ్డి
- కాళేశ్వరం అవినీతిపై పూర్తి స్థాయిలో విచారణ జరుగుతోందని వెల్లడి
- కవిత ఎవరో తనకు తెలియదని వ్యాఖ్య

హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)

కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతి, ఫోన్ ట్యాపింగ్ లో ఉన్న ఎవరైనా జైలుకు వెళ్లక తప్పదని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి స్పష్టం చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు ఇంజినీర్ల వద్దే కోట్లు దొరుకుతున్నాయంటే... ఆ సమయంలో అధికారంలో ఉన్న కేసీఆర్, హరీశ్ రావు వద్ద ఎన్ని కోట్లు ఉంటాయో ఊహించవచ్చని అన్నారు. దీనిపై పూర్తి స్థాయిలో విచారణ జరుగుతోందని... కేబినెట్ సమావేశం తర్వాత అన్ని విషయాలను వెల్లడిస్తారని చెప్పారు. సీఎం రేవంత్ గురించి మాట్లాడుతూ... రేవంత్ జూనియర్ అయినప్పటికీ సీనియర్లను గౌరవిస్తున్నారని కోమటిరెడ్డి కితాబునిచ్చారు. పార్టీలో అందరూ ఒక టీమ్ లా పనిచేస్తున్నామని చెప్పారు. బనకచర్ల ప్రాజెక్ట్ ను కట్టనివ్వబోమని, శ్రీశైలం ప్రాజెక్ట్ ను కాపాడతామని తెలిపారు. నల్గొండ జిల్లాను సస్యశ్యామలం చేస్తామని ధీమా వ్యక్తం చేశారు. సాగునీటి ప్రాజెక్టులపై తాము కట్టుబడి ఉన్నామని చెప్పారు. బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత వ్యవహారం గురించి ప్రశ్నించగా... ఆమె ఎవరో తనకు తెలియదని అన్నారు.





# మేము ఒక్క అడుగు వెనక్కి వేస్తే.. 10 అడుగులు ముందుకేస్తాం

- రేవంత్ రెడ్డి ప్రభుత్వం తప్పులు ఎత్తి చూపుతూ..
- బీసీల తరపున పోరాటం చేస్తున్నాం
- కోర్టు తీర్పును గౌరవించి దీక్షను ఇంతటితో ముగిస్తున్నాం
- ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

హైదరాబాద్ :

ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల సాధనే లక్ష్యంగా చేపట్టిన 72 గంటల నిరాహార దీక్షను విరమిస్తున్నట్లు తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత సోమవారం హైదరాబాద్‌లో ప్రకటించారు.

4లో

# తెలుగు రాష్ట్రాల్లో విజృంభిస్తున్న డెంగ్యూ జ్వరాలు



హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)


దోమ కాటువల్ల వచ్చే డెంగ్యూ జ్వరం సోకితే అప్రమత్తత చాలా అవసరం అంటున్నారు నిపుణులు. డెంగ్యూ వ్యక్తులు సరైన వైద్య పరీక్షలు చేయించుకుని, సమయానుకూలంగా చికిత్స తీసుకోవాలని చెబుతున్నారు. డెంగ్యూ జ్వరం ఎడిస్ ఈజిప్టి అనే దోమ కాటు ద్వారా వ్యాపించే వైరల్ ఇన్ఫెక్షన్. ఈ దోమలు ఎక్కువగా ఉదయం, సాయంత్రం సమయంలో దాడి చేస్తాయి. ఈ దోమలు నీరు నిల్వ ఉన్న స్థలం, చెత్త, డ్రైనేజీ ప్రాంతాల్లో

4లో

# కేబీఆర్ పార్కు చుట్టూ పైవంతెనలు, అండర్ పాస్‌లు

- రూ.1090 కోట్ల వ్యయంతో ప్రణాళికలు
- రాజధాని నడిబొడ్డున ఉన్న కేబీఆర్ పార్కు చుట్టూ పైవంతెన నిర్మాణాలు
- పార్కు చుట్టూ ఎకో సెన్సిటివ్ జోన్ దెబ్బ తింటుందని దాఖలైన కేసులు
- కొత్త డిజైన్లతో పనులు చేపట్టేందుకు జీహెచ్ఎంసీ ప్రణాళికలు

4లో



# హనుమకొండలో ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్య

- ఇష్టం లేని చదువులు చదవలేనని లేఖ రాసిన విద్యార్థిని

హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)

'మమ్మీ! ఆ చదువు నాకు అర్థం ఐతలేదు. నాకు టెన్షన్ అయితాంది. మైండ్ పోతాంది. నాకు ఏం చేయాలో కూడా తోస్తలే. ఇటు మీరు చెప్పిస్తున్న చదువు అర్థం కాక, మీకు చెప్పలేక మధ్యలో నలిగిపోతున్నా. ఫస్ట్ ఇయర్ ఫీజు కట్టింద్రని సదివిన.

4లో

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# తప్పు మొత్తం కేసీఆర్ దే..

హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)



మాజీ సీఎం కేసీఆర్ అధికారంలో ఉన్నప్పుడే మేడిగడ్డ కూలిపోయిందని మంత్రి ఉత్తమ్ కుమార్ ఆరోపించారు. ఆయన సోమవారం మీడియాతో మాట్లాడారు.. గత ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్ట్ కోసం అధిక వడ్డీలతో రూ.84వేల కోట్లు అప్పు తెచ్చిందని తెలిపారు. రుణాలు తెచ్చే విషయంలో అప్పటి బీఆర్ఎస్ నాయకులు అవకతవకలకు పాల్పడ్డారని విమర్శించారు. తుమ్మిడిహట్టి దగ్గర ప్రాజెక్ట్ కట్టాలని గతంలో నిర్ణయించినట్లు మంత్రి ఉత్తమ్ గుర్తు చేశారు. రూ.38వేల కోట్లతో తుమ్మిడిహట్టి దగ్గర ప్రాజెక్ట్ చేపట్టాల్సి ఉందన్నారు. కానీ బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చి స్థలాన్ని మార్చిందన్నారు. 16 లక్షల ఎకరాలకు నీరు ఇచ్చేలా డిజైన్ చేశారని పేర్కొన్నారు. కానీ కేసీఆర్ సీఎం అయ్యాక ఇష్టానుసారం డిజైన్లు మార్చేశారని మండిపడ్డారు. మేడిగడ్డ డిజైన్, నిర్మాణం అన్నీ కేసీఆరే చేశారని స్పష్టం చేశారు. అప్పుడు సీఎం, నీటిపారుదల మంత్రి రెండు ఆయనే అని తెలిపారు. 2016లో కాళేశ్వరం అగ్రిమెంట్ జరిగిందని, 2019లో పనులు ప్రారంభమయ్యాయని మంత్రి ఉత్తమ్ కుమార్ చెప్పుకొచ్చారు. 2023 అక్టోబర్‌లో మేడిగడ్డ కుంగిపోయిందన్నారు. రాజకీయాల అంశాలతో సంబంధం లేకుండా పీసీ ఘోష్ కమిషన్ వేశామని మంత్రి ఉత్తమ్ కుమార్ తెలిపారు. కమిషన్ 605 పేజీలతో కూడిన రిపోర్ట్‌ను ప్రభుత్వానికి ఇచ్చిందని చెప్పారు. రిపోర్ట్ అధ్యయనానికి ముగ్గురు అధికారులతో కమిటీ వేసినట్లు పేర్కొన్నారు. నివేదికను 25 పేజీలకు కుదించి కమిటీ క్లుప్తంగా అందించిందన్నారు. మేడిగడ్డ బ్యారేజీలో అనేక లోపాలున్నాయని కూడా చెప్పిందని స్పష్టం చేశారు. డిజైన్, నిర్మాణం, నిర్వహణలో లోపాలున్నాయని స్పష్టం చేసిందని అన్నారు. కాళేశ్వరం కమిషన్ నివేదికపై కేబినెట్‌లో చర్చించినట్లు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడిరచారు.




# కాళేశ్వరం నిర్మాణ, నిర్వహణలో తీవ్ర లోపాలు

(3వ పేజీ తరువాయి)

డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, శ్రీధర్‌బాబు, తుమ్మల నాగేశ్వరరావు, జూపల్లి కృష్ణారావు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, దామోదర రాజనర్సింహ, పొన్నం ప్రభాకర్, సీతక్క, కొండా సురేఖ, అడ్లూరి లక్ష్మణ్, వాకిటి శ్రీహరిలతో కలిసి మీడియాతో మాట్లాడారు.

**నాడు హామీ ఇచ్చాం...**

రూ.లక్ష కోట్లతో కట్టిన కాళేశ్వరం కూలిపోవడంపై అధికారంలోకి వచ్చిన వెంటనే విచారణ చేపడతామని ఎన్నికలప్పుడు ప్రజలకు హామీ ఇచ్చా మని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారు. దాని ప్రకారమే న్యాయరంగంలో విశేష అనుభవం ఉన్న ఉమ్మడి ఏపీ ప్రధాన న్యాయమూర్తి, సుప్రీంకోర్టు న్యాయమూర్తి, తొలి లోక్‌పాల్‌గా వ్యవహరించిన జస్టిస్ పినాకి చంద్రఘోష్ ఆధ్వర్యంలో కమిషన్‌ను నియమించామని గుర్తుచేశారు.

ఈ కమిషన్ 16 నెలలపాటు అందరి అభిప్రాయాలు తీసుకుని 665 పేజీల నివేదికను రూపొందించిందని, దీన్ని మంత్రివర్గం ఆమోదించిందని రేవంత్‌రెడ్డి చెప్పారు. ‘ఊరు, పేరు, అంచనాలు మార్చి అవినీతికి పాల్పడి అక్రమాలకు పునాదులు వేసి నిర్మించిన కాళేశ్వరం కూలిపోయింది. ఈ విషయాన్ని కమిషన్ స్పష్టంగా తన నివేదికలో పొందుపర్చింది. రాజకీయ నేతలు, ఇంజనీర్లు, ఐఏఎస్‌లు, నిపుణులు, ప్రజా సంఘాలు, ప్రజలు, పాత్రికేయుల నుంచి సమాచారం సేకరించడమేకాక, వారి వాదనలను పరిగణనలోకి తీసుకుంది.

మంత్రివర్గం ఆమోదించిన నివేదికను శాసనసభలో ప్రవేశపెట్టి, అన్ని రాజకీయ పక్షాల అభిప్రాయాలను, ప్రతిపక్ష నాయకుడు, అప్పటి నీటిపారుదల మంత్రి, ఇతర మంత్రుల అభిప్రాయాలను స్వేచ్ఛగా వ్యక్తం చేయడానికి అవకాశం కల్పిస్తాం. దీనిపై సభ్యులకు పూర్తి అవగాహన కల్పిస్తాం. తొందరలోనే సభ ఏర్పాటు చేసి అందరి అభిప్రాయాలను విన్నాకే ప్రభుత్వం ముందుకెళ్తుంది’ అని సీఎం చెప్పారు.

**నోటీసులు ఇచ్చి.. వాదనలు విన్న కమిషన్**

‘కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో కీలక భూమిక పోషించిన అప్పటి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు, నీటిపారుదల శాఖ మంత్రి హరీశ్‌రావు, ఆర్థిక మంత్రి ఈటల రాజేందర్, ఐఏఎస్ అధికారులు, ఇంజనీర్లు, నిర్మాణ సంస్థలకు నోటీసులు ఇచ్చి వారికి తమ వాదనలు వినిపించడానికి కమిషన్ పూర్తి అవకాశం కల్పించింది.

దివంగత సీఎం రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ప్రాణహిత-చేవేళ్లకు గోదావరి నీళ్లు తీసుకుని రావడానికి ప్రాజెక్టు డిజైన్ చేస్తే.. తెలంగాణ రాష్ట్రం వచ్చిన ఏడాదిన్నర తరువాత అప్పటి ముఖ్యమంత్రి చంద్రశేఖర్‌రావు రీడిజైన్ పేరిట ప్రాణహిత-చేవేళ్ల ప్రాజెక్టు స్థలం తుమ్మిడిహెట్టి నుంచి మార్చి, మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బరాజ్‌లను నిర్మించారు.

కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం జరిగిన మూడేళ్లల్లోనే మేడిగడ్డ కుంగడం, అన్నారం, సుందిళ్ల పగలడం జరిగింది. ప్రణాళిక, నిర్మాణ, నిర్వహణ లోపాలు ఉన్నాయని నిపుణులు నివేదించారు. ప్రాజెక్టులు ప్రమాదంలో పడ్డాయని సాంకేతిక నిపుణులు, నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీతో సహా కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలు గుర్తించి వాటి మీద విచారణ చేశాయి. ఆ విచారణలో ప్రణాళిక, నిర్మాణ, నిర్వహణలో లోపాలు ఉన్నాయిని తేల్చాయి. దీని మీద పూర్తిస్థాయి విచారణ జరగాలని ఆనాటి ముఖ్యమంత్రికి నివేదిక ఇచ్చాయి.

మా పార్టీ నాయకుడు రాహుల్ గాంధీతోపాటు టీపీసీసీ అధ్యక్షుడిగా నేను, మా కాంగ్రెస్ నాయకులు భట్టి విక్రమార్క, శ్రీధర్ బాబు, ఉత్తమకుమార్ రెడ్డి ఈ ప్రాజెక్టులను సందర్శించాం. లోపభూయిష్టమైన నిర్ణయాలు, అవినీతి, అశ్రిత పక్షపాతం నిర్లక్ష్య వైఖరి ఎన్నో లోపాలతో కూడుకున్న నిర్ణయాల వల్ల రూ.లక్ష కోట్లతో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు పూర్తిగా కూలిపోయింది’ అని రేవంత్‌రెడ్డి అన్నారు.

**అనుకూలమైతే ఒకలా.. లేదంటే మరోలా..**

నివేదికలు తమకు అనుకూలంగా ఉంటే ఒకలా.. లేదంటే మరోలా మాట్లాడడం బీఆర్ఎస్ నాయకులకు అలవాటేనని సీఎం రేవంత్‌రెడ్డి ఎద్దేవా చేశారు. కమిషన్ నివేదికను వారు తప్పుపట్టడం సహజమేనని వ్యాఖ్యానించారు. ఇది రాజకీయ నివేదికనో, ప్రభుత్వ నివేదికనో కాదని, ఇది స్వతంత్ర కమిషన్ ఇచ్చిన నివేదిక అని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. ఎవరు ఏ రకమైన విశ్లేషణలు చేస్తారన్నది వారి విజ్ఞతకే వదిలేస్తున్నానని చెప్పారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో హరీశ్‌రావు అవినీతి చేశారని, ఇందులో ఎవరెవరు కుమ్మక్కయ్యారో కవిత.. జస్టిస్ చంద్ర ఘోష్ కమిషన్‌కు నివేదిక ఇచ్చి ఉంటే బాగుండేదని సీఎం వ్యాఖ్యానించారు. కవిత అప్పుడు మాట్లాడకుండా, ఇప్పుడు ఇక్కడ ప్రశ్నించడం ఎందుకని, కోల్‌కతాకు వెళ్లి అడగమనండి అని పేర్కొన్నారు. కమిషన్ నివేదికపై ఊహాజనిత వార్తలు, కల్పనకు అవకాశం ఉండకూడదనే ఏ శషభిషలు లేకుండా అన్ని విషయాలను స్పష్టంగా మీడియాకు చెప్పానన్నారు.

# కాళేశ్వరం నివేదికపై ఆరోపణలు



(3వ పేజీ తరువాయి)

అంతేకాకుండా.. లక్షల కోట్ల రూపాయిలతో ఈ ప్రాజెక్ట్ నిర్మించి ప్రజాధనాన్ని వృథా చేశారంటూ ఇప్పటికే అధికార, విపక్ష పార్టీ బీజేపీ నేతలు.. బీఆర్ఎస్‌పై నిప్పులు చెరుగుతున్నారు. అలాంటి వేళ.. బీఆర్ఎస్ పార్టీ కీలక నిర్ణయం తీసుకుంది. అందులోభాగంగా రేపు.. అంటే మంగళవారం తెలంగాణ భవన్‌లో కాళేశ్వరం కమిషన్ నివేదికపై ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీష్‌రావు పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ఇవ్వనున్నారు. రేపు మధ్యాహ్నం 12.00 గంటలకు ఆయన ఈ ప్రెజెంటేషన్ ఇవ్వనున్నారు. ఇక ఈ ప్రెజెంటేషన్‌ను అన్ని నియోజకవర్గాల్లో.. బహిరంగంగా ప్రదర్శించాలని పార్టీ ఆదేశించింది. ఈ నేపథ్యంలో అందుకు సంబంధించిన ఏర్పాట్లు యుద్ధ ప్రాతిపదికన ఏర్పాట్లు చేస్తున్నారు.

మరోవైపు ఈ ప్రాజెక్ట్‌కు కర్త, కర్మ, క్రియ అంతా కేసీఆరే అంటూ ఇప్పటికే ఓ ప్రచారం సాగుతోంది. అలాంటి వేళ.. కమిషన్ ఇచ్చిన నివేదికపై హరీశ్ రావు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇవ్వనున్నారు. ఇంకోవైపు జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్.. 650 పేజీలతో ఈ నివేదికను ప్రభుత్వానికి అందజేస్తే.. దీనిపై ఏర్పాటైన కమిషన్ 60 పేజీలకు అందులోని సారాన్ని కుదించింది.

# మేము ఒక్క అడుగు వెనక్కి వేస్తే.. 10 అడుగులు ముందుకేస్తాం

(3వ పేజీ తరువాయి)

ఈ నిరాహార దీక్షకు కోర్టు అనుమతి నిరాకరించిందని చెప్పారు. దీంతో తాను చేపట్టిన ఈ దీక్షను విరమిస్తున్నట్లు తెలిపారు. కోర్టులను ధిక్కరించే పరిస్థితి లేదని పేర్కొన్నారు. కోర్టుల పట్ల తనకు గౌరవం ఉందన్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం తప్పులు ఎత్తి చూపుతూ.. బీసీల తరపున పోరాటం చేస్తున్నామని చెప్పారు. మేము ఒక్క అడుగు వెనక్కి వేస్తే.. 10 అడుగులు ముందుకు వేస్తామని కవిత చెప్పారు. కోర్టు తీర్పును గౌరవించి ఈ దీక్షను ఇంతటితో ముగిస్తున్నామన్నారు. ఈ పోరాటం ఆగదని.. అనేక రూపాల్లో చేస్తామని ఈ సందర్భంగా ఆమె ప్రకటించారు. కాంగ్రెస్ పార్టీ ధర్నాలతో సాధించేది ఏం లేదన్నారు. మీరు రాష్ట్రపతి వద్దకు వెళ్లండంటూ తెలంగాణ ప్రభుత్వంలోని పెద్దలకు ఆమె సూచించారు.

రాష్ట్ర గవర్నర్‌పై సుప్రీంకోర్టులో కేసు వేయండంటూ అధికార పార్టీ నేతలకు హితవు పలికారు. ఢల్లీలో టైమ్ పాస్ ధర్నాలు చేస్తే తెలంగాణ బీసీ బిడ్డలు ఊరుకోరని హెచ్చరించారు. ఈ దీక్ష విరమించినా.. మళ్లీ సమాలోచనలు చేసి మరో రూపంలో పోరాటం చేస్తామని వెల్లడిరచింది. స్థానిక సంస్థల్లో బీసీలకు రిజర్వేషన్లు కేటాయించకుండా ఎన్నికలకు వెళ్తే వాటిని ఎలా ఆపాలో తనకు తెలుసునన్నారు. స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కచ్చితంగా వస్తాయనే నమ్మకం తనకు ఉందని ఈ సందర్భంగా కల్వకుంట్ల కవిత విశ్వాసం వ్యక్తం చేశారు. తెలంగాణలో సెప్టెంబర్ 30వ తేదీ లోపు స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని గతంలో హైకోర్టు ఆదేశించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాలని రేవంత్ ప్రభుత్వం నిర్ణయించింది. ఈ బిల్లును అసెంబ్లీలో ఆమోదించి.. గవర్నర్ వద్దకు పంపారు. ఈ బిల్లు ఆమోదానికి ఎటువంటి అడ్డంకులు ఎదురు కాకుండా.. సీనియర్ న్యాయవాదుల సలహాను సైతం ఆయన స్వీకరించారు. అనంతరం కేంద్ర హోం మంత్రిత్వ శాఖకు ఈ బిల్లును పంపారు. అయితే ఈ బిల్లు ఆమోదం కోసం దేశ రాజధాని న్యూఢల్లీలో ఆగస్ట్ 5వ తేదీన ధర్నా చేసేందుకు కాంగ్రెస్ పార్టీ రంగం సిద్ధం చేసింది. మరోవైపు ఈ బిల్లును ఆమోదించాలంటూ కేంద్రాన్ని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. ఆ క్రమంలో హైదరాబాద్‌లోని ధర్నా చౌక్ వద్ద సోమవారం 72 గంటల దీక్షను తన అనుచరులతో కవిత చేపట్టారు.



# తెలంగాణ బీజేపీ అధ్యక్షుడి కీలక ప్రకటన!

హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)

బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామని చెప్పినప్పుడు, అందులో 10 శాతం ముస్లింలకు ఇస్తామని కాంగ్రెస్ చెప్పలేదని, పూర్తిగా బీసీలకే రిజర్వేషన్లు ఇస్తే తాము పూర్తిస్థాయిలో మద్దతు ఇస్తామని తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రామచందర్ రావు స్పష్టం చేశారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, ఢల్లీలో కాంగ్రెస్ చేపట్టిన ధర్నాపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వానికి స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించే ఉద్దేశం లేదని విమర్శించారు. హైదరాబాద్‌లో చేసినట్లే ఢల్లీకి వెళ్లి నాటకాలు చేస్తున్నారని విమర్శించారు. బీసీలకే 42 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తామంటే బీజేపీ పూర్తి మద్దతు ఇస్తుందని ఆయన తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వానికి బీసీ రిజర్వేషన్లు ఇవ్వడం ఇష్టం లేదని ఆరోపించారు. 42 శాతం రిజర్వేషన్లు బీసీలకు ఇస్తామని చెప్పి, అందులో 10 శాతం ముస్లింలకు ఇస్తే అణగారిన వర్గాలకు అన్యాయం జరుగుతుందని మండిపడ్డారు. రిజర్వేషన్లను బీజేపీ అడ్డుకుంటోందని ప్రచారం చేస్తోన్న కాంగ్రెస్ పార్టీని బీసీలు నమ్మరని ఆయన అన్నారు.



# తెలుగు రాష్ట్రాల్లో విజృంభిస్తున్న డెంగ్యూ జ్వరాలు

(3వ పేజీ తరువాయి)

ఎక్కువగా అభివృద్ధి చెందుతాయి. డెంగ్యూ జ్వరం సాధారణ జ్వరంతో పాటు తీవ్రమైన డెంగ్యూ హెమరాజిక్ ఫీవర్‌గా మారే అవకాశం ఉంటుందని వైద్యులు చెబుతున్నారు.. ఇది ప్రాణాంతకమవుతుంది కాబట్టి, తగు జాగ్రత్తలు తీసుకోవడం చాలా మంచిదని సూచిస్తున్నారు. . డెంగ్యూ జ్వరం సోకిన తర్వాత నాలుగు నుంచి 10 రోజుల్లో లక్షణాలు కనిపిస్తాయి. ఇందులో అధిక జ్వరం, తీవ్రమైన తలనొప్పి, కీళ్లు, కండరాల నొప్పి, కళ్ల వెనుక నొప్పి, చర్మంపై దద్దుర్లు, వాంతులు, వికారం వంటి లక్షణాలు కనిపిస్తాయి. తీవ్రమైన డెంగ్యూ హెమరాజిక్ ఫీవర్‌లో ముక్కు, చిగుళ్ల నుంచి రక్తస్రావం, రక్తపోటు తగ్గడం, ఊపిరితిత్తుల్లో నీరు చేరడం వంటివి జరిగి ప్రాణాంతకం కావచ్చు అంటున్నారు వైద్యులు. లక్షణాలు కనిపించిన వారు వెంటనే వైద్యుడిని



సంప్రదించాలని కోరుతున్నారు. డెంగ్యూ నిర్ధారణకు యాంటిజెన్ టెస్ట్, యాంటీబాడీ టెస్ట్ చేయిస్తారు. చికిత్సలో పూర్తి విశ్రాంతి తీసుకోవాలని చెబుతున్నారు. ఎక్కువగా నీరు తాగాలి.వంటి ద్రవణాలు తీసుకుంటూ ఉండాలి. వైద్యుల సలహా మేరకు జ్వరం, నొప్పి ఉన్నప్పుడు సూచించిన మాత్రలు తప్ప నిసరిగా వాడాలి.

# కేబీఆర్ పార్కు చుట్టూ పైవంతెనలు, అండర్ పాస్‌లు

హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)

హైదరాబాద్ మహా నగరంలో రోజురోజుకూ పెరుగుతున్న జనాభా, ట్రాఫిక్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని రోడ్లు, భవనాలు వంటి నిర్మాణాల అవసరం ఎంతైనా ఉంది. అయితే వారికి తగ్గట్టు నిర్మాణాలే కాదు స్వచ్ఛమైన గాలి, వాతావరణం కూడా అవసరమే. దీనికిగానూ నగరంలోని పార్కులు కీలక పాత్ర పోషిస్తున్నాయి. అభివృద్ధి పేరుతో వాటికి ప్రమాదం ఏర్పడితే భవిష్యత్తులో నగర వాసులు తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుంది.

కాగా మహానగరానికి తలమానికంగా ఇప్పటికే దుర్గం చెరువుపై కేబుల్ బ్రిడ్జి ఉంది. దీని ద్వారా భాగ్యనగరం అందాలు మరింత పెరిగి హైటెక్? సిటీకే వన్నె తీసుకొచ్చాయి. దీనిద్వారా పర్యాటకానికి కొత్త ఊతాన్ని ఇచ్చినట్లు అయింది. అయితే ఇప్పుడు ఇదే మాదిరిగా నగరంలో మరెన్నో పైవంతెలనలు, అండర్ పాస్‌లు, బ్రిడ్జిలను నిర్మించాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది.



ఎకో సెన్సిటివ్ జోన్ దెబ్బతింటుందని : నగర అభివృద్ధిలో భాగంగా రాజధాని నడిబొడ్డున ఉన్న కేబీఆర్ పార్కు చుట్టూ రూ.1090 కోట్లతో పైవంతెనలు, అండర్ పాస్‌ల నిర్మాణం జరగబోతోంది. వాటి నిర్మాణ పనులతో పార్కు చుట్టూ ఎకో సెన్సిటివ్ జోన్ (ఈఎస్‌జెడ్) దెబ్బ తింటుందని, చెట్లను పెద్దఎత్తున తొలగించాల్సి వస్తుందనే అంశాలపై న్యాయస్థానాల్లో కేసులు దాఖలయ్యాయి. ఈ కేసులు కొలిక్కి రావడంతో వాటిని నిర్మించేందుకు కొత్త డిజైన్లతో పనులు చేపట్టేందుకు జీహెచ్‌ఎంసీ ప్రణాళికలు రచిస్తోంది. పార్కు చుట్టూ ఆరు జంక్షన్ల వద్ద 307 ఆస్తులను సేకరించాల్సి ఉంది. దీనికోసం భూ సేకరణ ప్రక్రియను వేగవంతం చేసినట్లు కమిషనర్ ఆర్వీ కర్ణన్ స్పష్టం చేశారు.

దీనిలో భాగంగా గత ప్రభుత్వ హయాంలో వ్యూహాత్మక రహదారుల అభివృద్ధి కార్యక్రమం (ఎస్సార్డీపీ) కింద 1,942 చెట్లు తొలగించి కేబీఆర్ పార్కు చుట్టూ ఉన్న పైవంతెనల నిర్మాణానికి రూపు దిద్దుకున్నాయి. కాగా వాటి ప్రకారం నిర్మాణాలు చేపడితే వాతారణం, జీవ వైవిధ్యం దెబ్బతింటుందని కేసులు నమోదయ్యాయి. కాంగ్రెస్ ప్రభుత్వం ఆయా డిజైన్లను పూర్తిగా మార్చింది. ఈఎస్?జెడ్?కు దూరంగా ప్రస్తుతం ఉన్న రోడ్డు పైనే పైవంతెనలు, అండర్‌పాస్‌ల నిర్మాణానికి ప్రతిపాదనలు రూపొందించింది. వాటి ప్రకారం మొత్తం 1,942 చెట్లను తొలగించాల్సి ఉంటుందని పేర్కొంది. అయితే అందులోని సగం చెట్లను వేర్వేరు ప్రాంతాల్లో తిరిగి నాటుతామని ముఖ్య ఇంజినీరు భాస్కర్ రెడ్డి తెలిపపారు. కంటోన్మెంట్ నియోజకవర్గంలో ఆర్మీ ఆర్డినెన్స్ కార్ప్స్ (ఏఓసీ) రోడ్లను రక్షణశాఖ అధికారులు తరచూ మూసేస్తుంటారు. ఈ సమస్యను పరిష్కరించేందుకు 6 కి.మీ పొడవైన ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి టెండర్లు పిలిచినట్లు సీఈ భాస్కర్‌రెడ్డి తెలిపారు. వీటి నిర్మాణ పనులు పూర్తయితే ఏఓసీ రోడ్లతో అవసరం లేకుండా మల్కాజిగిరి సికింద్రాబాద్ ప్రాంతాల మధ్య రాకపోకలు కొనసాగుతాయని వివరించారు.

# హైదరాబాద్‌లో వర్ష బీభత్సం

(3వ పేజీ తరువాయి)

అప్రమత్తమైన హైడ్రా, జీహెచ్ఎంసీ బృందాలు సహాయక చర్యల కోసం రంగంలోకి దిగాయి. షేక్‌పేట్‌లో అత్యధికంగా 7.4 సెం.మీ. వర్షపాతం నమోదైంది. ఆసిఫ్‌నగర్‌లో 5.3, ఖైరతాబాద్‌లో 5 సెం.మీ. వర్షపాతం నమోదైంది. పంజాగుట్టమాసాబ్‌ట్యాంక్ రోడ్డులో ట్రాఫిక్ ట్రామ్ ఏర్పడిరది. రాజ్‌భవన్ సమీపంలో రోడ్లపై మోకాలిలోతు నీరు నిలిచిపోయింది. మరింత భారీ వర్షసూచన ఉండటంతో ఉద్యోగులకు సేఫ్టీ గైడ్‌లైన్స్ జారీచేసింది పోలీసు శాఖ. దశలవారీగా ఇళ్లకు బయల్దేరారని సూచించింది. రేపు తెలంగాణలోని అన్ని జిల్లాల్లో ఉరుములు, మెరుపులు,



ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ వెల్లడిరచింది, గంటకు 30 నుండి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీచే అవకాశం కూడా ఉందని హైదరాబాద్ వాతావరణ శాఖ హెచ్చరించింది.

## భూగర్భ డ్రైనేజీ నిర్మాణ పనులు పూర్తి అయ్యాయి నందుకు కార్పొరేటర్ కు సంతోషం వ్యక్తం చేసిన కాలనీవాసులు

◆ కార్పొరేటర్ శాంతి సాయి జన్ శేకర్

నాచారం, తెలంగాణ ముచ్చట్లు:

నాచారం డివిజన్ లో సాయి నగర్ కాలనీ లో నూతనంగా ఏర్పాటు చేసిన భూగర్భ డ్రైనేజీ నిర్మాణ పనులు పూర్తి అయ్యాయి నందుకు కార్పొరేటర్ కు సంతోషం వ్యక్తం చేశారు.

నాచారం మెయిన్ రోడ్డు నుండి చంద్ర గ్రాండ్ హోటల్ పక్కనుండి ఇదివరకు ఉన్న ఓపెన్ నాలా గుండా సాయి నగర్ కాలనీ లోనికి వర్షపు నీరు మరియు డ్రైనేజీ నీరు వస్తుంది. ఇందులో సగం కంటే ఎక్కువ శాతం డ్రైనేజీ నిర్మాణం చేయడం జరిగింది. ఇంకా కొంత మిగిలి ఉండడంతో డ్రైనేజీలు నిండి ఇళ్లల్లోకి నీళ్లు వస్తున్నాయని మిగిలిన సుమారు 50 మీటర్లు కూడా డ్రైనేజీ నిర్మించాలని కాలనీ ప్రతినిధులు సోమవారం రోజు డివిజన్ కార్పొరేటర్ శాంతి సాయిజెన్ శేఖర్ ను కలిసి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. సానుకూలంగా స్పందించిన కార్పొరేటర్ జలమండలి డీజీఎం సతీష్ తో మాట్లాడి మిగిలిన డ్రైనేజీ నిర్మించాలని సూచించడం జరిగింది. తప్పకుండా చేస్తానని డీజీఎం హామీ ఇవ్వడం జరిగింది.




ఈ కార్యక్రమంలో సాయి నగర్ కాలనీ ప్రెసిడెంట్ ఎంఎ రావూఫ్ ,జనరల్ సెక్రెటరీ శ్రీనివాస్ ,వైస్ ప్రెసిడెంట్ మధు, కోశాధికారి రాజు, వెంకటేష్ రావు, అక్బర్, నవీన్, సునీల్, రాజు,సుధాకర్,చారి తదితరులు పాల్గొన్నారు

## మీనాక్షి నటరాజన్ ను మర్యాదపూర్వకంగా కలిసిన కాంగ్రెస్ నాయకులు గట్టు రాజు

వనపర్తి, తెలంగాణ ముచ్చట్లు:

ఢిల్లీలో నిర్వహించనున్న బీసీ రిజర్వేషన్ ధర్నా కార్యక్రమానికి హాజరయ్యేందుకు రైలు మార్గం లో వెళ్తున్న తెలంగాణ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్ ను అదే బోగీలో ప్రయాణిస్తున్న పెద్దమందడి మండల కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కోఆర్డినేటర్ గట్టు రాజు మర్యాదపూర్వకంగా కలిసి వారితో ప్రస్తుత రాజకీయ అంశాల గురించి మాట్లాడడం జరిగింది .స్థానిక సంస్థల ఎన్నికలలో పార్టీకి మొదటి నుంచి కష్టపడుతున్న కార్యకర్తలకు ప్రథమ స్థానం కల్పించాలని వారికి విన్నవించుకోవడం జరిగింది. వారు సానుకూలంగా స్పందించారు. మీనాక్షి నటరాజన్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాల గురించి సోషల్ మీడియా ద్వారా ప్రజలకు తెలియజేసి కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయాలని సూచించారు.గట్టు రాజు మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ప్రజా ప్రభుత్వం దేశంలోనే మొట్టమొదట కులగణన చేసి అట్టి బిల్లును రాష్ట్ర అసెంబ్లీ ఆమోదం తెలుపగా కేంద్ర ప్రభుత్వాన్ని బీసీ బిల్లును ఆమోదించి షెడ్యూల్ 9 లో చేర్చి చట్టబద్రత కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వం కోరగా కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తూ కాలం గడుపుతున్న తరుణంలో కాంగ్రెస్ పార్టీ అధినేత మల్లికార్జున్ ఖర్గే, లోక్ సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ , రాష్ట్ర తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ,తెలంగాణ పిసిసి అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్, కేంద్ర ప్రభుత్వాన్ని కి కనువిప్పు కలిగించి బీసీల చిరకాల ఆకాంక్ష నెరవేర్చాలని చలో ఢిల్లీ కార్యక్రమానికి పిలుపునిచ్చారు. చలో ఢిల్లీ కార్యక్రమానికి మద్దతుగా రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి ఆదేశానుసారం వనపర్తి కాంగ్రెస్ పార్టీ శ్రేణులు వనపర్తి జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నుంచి ఢిల్లీలో జరిగే మహాధర్నకు బయలుదేరడం జరిగింది అని తెలిపారు.



# బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల కోసం ప్రత్యేక రైలులో ఢిల్లీకి

◆ జెండా ఊపి రైలును ప్రారంభించిన మీనాక్షి నటరాజన్, మహేష్ కుమార్ గౌడ్, మంత్రులు

చర్లపల్లి, తెలంగాణ ముచ్చట్లు:

రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలనే డిమాండ్ తో కాంగ్రెస్ పార్టీ ఈనెల 7న తలపెట్టిన ఛలో ఢిల్లీ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో తరలి వెళ్లారు.
చర్లపల్లి రైల్వే స్టేషన్ నుంచి ఏర్పాటు చేసిన ప్రత్యేక రైలును సోమవారం ఏఐసీసీ రాష్ట్ర ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్ , టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ,మంత్రులు పొన్నం ప్రభాకర్ ,వాకిటి శ్రీహరి బొంతు రామ్మోహన్ ,మేడ్చల్ ఇంచార్జి వజ్రేష్ యాదవ్ తో పాటు ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి జెండా ఊపి రైలును ప్రారంభించారు.

ఈ కార్యక్రమంలో లింగోజిగూడ,చెర్లపల్లి,కాప్రా కార్పొరేటర్లు ధర్పల్లి రాజశేఖర్ రెడ్డి,బొంతు శ్రీదేవి ,స్వర్ణరాజ్ శివమణి , ఉప్పల్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ,డివిజన్ అధ్యక్షులు,కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.





## తెలంగాణ కాంగ్రెస్ బీసీ నేతలతో ఢిల్లీకి ప్రత్యేక రైలు ప్రయాణం చేసిన కార్పొరేటర్ బొంతు శ్రీదేవి యాదవ్

చర్లపల్లి, తెలంగాణ ముచ్చట్లు:

చర్లపల్లి రైల్వే స్టేషన్ నుండి తెలంగాణ కాంగ్రెస్ బీసీ నేతలతో ఢిల్లీకి బయలుదేరిన ప్రత్యేక రైలు ద్వారా కార్పొరేటర్ బొంతు శ్రీదేవి యాదవ్ ప్రయాణించారు. ఈ రైలు యాత్రలో ఏఐసీసీ ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి, బొంతు రామ్మోహన్, పరమేశ్వర్ రెడ్డి, వజ్రేష్ యాదవ్ తో కలిసి కార్పొరేటర్ పాల్గొన్నారు.



ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ కాంగ్రెస్ పార్టీ 5,6,7 తేదీల్లో చేపట్టనున్న బిసిల దీక్షను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. బీసీల ఆత్మగౌరవం కోసం, రాజకీయ అవకాశాల్లో బిసిలకు న్యాయమైన వాటా కోసం కాంగ్రెస్ చేస్తున్న ఈ పోరాటానికి అన్ని వర్గాల ప్రజలు మద్దునివ్వాలని కోరారు.



## వైల్డ్ లైఫ్ మీటింగ్ లో పాల్గొన్న వైరా ఎమ్మెల్యే రామదాసు నాయక్..

ఖమ్మం బ్యూరో చీఫ్, తెలంగాణ ముచ్చట్లు:

తెలంగాణ అంబేద్కర్ సచివాలయం భవనంలో అటవీ శాఖ మంత్రి, వైల్డ్ లైఫ్ చైర్మన్ కొండ సురేఖ ఆధ్వర్యంలో వైల్డ్ లైఫ్ మీటింగ్ నిర్వహించారు. ఈ సమావేశంలో వైరా శాసనసభ్యులు, వైల్డ్ లైఫ్ బోట్ మెంబర్ మాలోత్ రాందాస్ నాయక్ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే రాందాస్ నాయక్ మాట్లాడుతూ వైరా నియోజకవర్గ అభివృద్ధి కోసం ముఖ్యంగా వైరా కేంద్రంలో వైరా రిజర్వాయర్ ప్రాజెక్ట్ ను టూరిజం హబ్ గా మార్చాలని ముఖ్యమైన ప్రతిపాదన పెట్టినారు. తద్వారా బృందాన్ని వైరా ప్రాజెక్టును సందర్శించే దానికున్న వసతులు పరిశీలించే అధ్యయనం చేసి వెంటనే దాన్ని టూరిజం హబ్ గా మార్చాలని ప్రతిపాదన పెట్టారు. దీనికి సంబంధిత అధికారులు అటవీ శాఖ మంత్రి కొండ సురేఖ, పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క సానుకూలంగా వ్యవహరించి వెంటనే సంబంధిత అధికారులను వెళ్ళి పరిశీలించాలని టూరిజం హబ్ గా మార్చాలని సూచించారు. సంబంధిత అధికార బృందానికి మంత్రికి అభినందనలు తెలియజేశారు.



## కబ్జా కోరల నుండి నాలాను కాపాడండి.

◆ గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ కు లేఖ.

హసన్ పర్తి,తెలంగాణ ముచ్చట్లు:

గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ 55వ డివిజన్ భీమారం గ్రామంలోని శ్యామలచెరువు నాలాను కబ్జాకోరాల నుండి కాపాడాలని సోమవారం రోజున గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ కు భీమారం గ్రామ ప్రజలు వినతి పత్రం అందజేశారు. 55వ డివిజన్ భీమారంలోని శ్యామల చెరువు నాలా ను రాజకీయ నాయకులు, రెవెన్యూ కు సంబంధించిన అధికారులు కబ్జా చేసి 33 ఫీట్ల ఉన్న నాలను ప్రస్తుతం 3ఫీట్లు చేశారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. నాలా కబ్జాకు గురి కావడంతో కాలువలో వెళ్లే నీరు రోడ్లమీద ప్రవహిస్తు నివాస గృహములలోకి చేరుతున్నాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. గత 10 సంవత్సరాల నుండి కబ్జాకు గురి అయిన నాలాను రక్షించాలని సంబంధిత అధికారుల చుట్టూ తిరిగిన అధికారులు పట్టించుకోవడం లేదని ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి శ్యామలచెరువు నాలను కాపాడాలని కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో సంగాల విక్టరీ బాబు,అటికం రాజు, గుంజ సాయికుమార్, రాయి కంటి సురేష్, చింత లక్ష్మణ్, బూర శరత్ కుమార్, పప్పుల రమేష్, నాతి రమేష్, పల్లాల శ్రీధర్, కోటగిరి సమ్మయ్య, ఆకుల కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి జిల్లా కలెక్టర్ మను చౌదరి

మేడ్చల్ మల్కాజ్గిరి ,కలెక్టర్, తెలంగాణ ముచ్చట్లు:

ప్రజావాణిలో స్వీకరించిన దరఖాస్తులను సంబంధిత శాఖల అధికారులకు అందజేస్తూ జాప్యం లేకుండా సత్వరమే అర్జీలను పరిశీలించి పరిష్కరించాలని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరు మిక్కిలినేని మను చౌదరి అధికారులను ఆదేశించారు. సోమవారం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి అదనపు కలెక్టర్లు రాధికగుప్తా, విజయేందర్ రెడ్డి, డిఆర్ఓ హరిప్రియలతో కలిసి కలెక్టరు (91) దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టరు మాట్లాడుతూ ఎంతో వ్యయ, ప్రయాసలకోర్చుకొని వారి సమస్యలను పరిష్కరిస్తామనే నమ్మకంతో ప్రజలు మన వద్దకు వస్తారని, వారి నమ్మకాన్ని నిలబెట్టాల్సిన బాధ్యత మనందరి పైన ఉన్నదని అన్నారు.
ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని దరఖాస్తుల పరిశీలనలో ఏలాంటి జాప్యం ఉండకూడదని కలెక్టరు అన్నారు.
అదేవిధంగా తిరస్కరించే దరఖాస్తుల గురించి తిరస్కరణకు గల కారణాలను తప్పనిసరిగా వివరంగా అర్జీదారులకు తెలియజేయాలని అధికారులకు సూచించారు. స్వీకరించిన దరఖాస్తులపై తీసుకున్న చర్యల వివరాలను ఆన్ లైన్ లో వెంట వెంట నమోదు చేయాలని సంబంధిత అధికారులకు కలెక్టరు సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.





## స్నేహితుడి కుటుంబానికి ఆర్థిక సాయం అందించిన తోటి స్నేహితులు

వనపర్తి,తెలంగాణ ముచ్చట్లు:

పెద్దమందడి మండల కేంద్రానికి చెందిన వెల్డింగ్ కృష్ణయ్య రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం జరిగింది.విషయం తెలుసుకున్న తోటి స్నేహితులు 198687 వ పదవ తరగతి బ్యాచ్ వారి కుటుంబానికి మనోధైర్యానిస్తూ ఆర్థిక సహాయం 27,500/వేల రూపాయలు అందజేశారు.వారి కుటుంబానికి ఎల్లవేళలా అండగా ఉంటామని భరోసానిచ్చారు.ఈ కార్యక్రమంలో స్నేహితులు మాజీ జెడ్పిటిసి వెంకట్ స్వామి, శ్రీనివాస్ యాదవ్,తదితరులు పాల్గొన్నారు.

# కేశవరావు కుటుంబానికి పూర్వ స్నేహితులు చేయూత..

ఖమ్మం బ్యూరో చీఫ్, తెలంగాణ ముచ్చట్లు:

తల్లాడ మండలంలోని అన్నారు గూడెం గ్రామానికి చెందిన గుమ్మా కేశవరావు ఇటీవల మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న 1991_1992 సంవత్సరం 10వ తరగతి పూర్వ విద్యార్థులు సహాయ నిధి నుంచి వాళ్ల చిన్ననాటి స్నేహితుడు గుమ్మా కేశవరావుకు ఆర్థిక సాయం అందించారు. సోమవారం ఆయన దశదిన కర్మ సందర్భంగా ఆ కుటుంబ సభ్యులకు 51,500 ఆర్థిక సహాయం అదించారు. ఈ కార్యక్రమంలో ఉల్లి ప్రభాకర్ రావు, మంచికంటి శ్రీనివాసరావు, దురిశాల బాబురావు, చిట్టెం నరసింహారావు, కంబాల హనుమంతరావు, దివ్వల శీను, వై ప్రసాదు, కొత్తపల్లి దానయ్య, రెంటపల్లి మరియన్న, ఇంజం నాగమణి, యలగందుల సురేష్ , తూము వీరయ్య, చిన్ననాటి స్నేహితులు పాల్గొన్నారు.



తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



## ప్రజలకు మనోధైర్యాన్ని భద్రత భరోసా కల్పిస్తాం కీసర సిఐ ఆంజనేయులు

- నూతన సిఐ ను సన్మానించిన ఆర్ జి కే కాలనీ మాల సంఘం సభ్యులు
- కీసర, తెలంగాణ ముచ్చట్లు:

కీసర నూతనంగా పదవి బాధ్యతలు స్వీకరించినటు వంటి సిఐ అర్వపల్లి ఆంజనేయులు ను ఆదివారం రోజున ఆర్ జి కే కాలనీ మాల సంక్షేమ సంఘం కమిటీ సభ్యులు మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు.

ఈ సందర్భంగా మాల సంక్షేమ సంఘం కమిటీ సభ్యులు మాట్లాడుతూ. కాలనీ లోని పలు సమస్యలు తీర్చాలని,ప్రజలకు మనోధైర్యాన్ని భద్రత భరోసా తో పాటు ముక్యంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని కోరారు. పోలీసు శాఖ అంటే శ్రీరామరక్ష లాగా ఉండాలని నూతన సిఐ ఆంజనేయులు ని కోరడం జరిగింది.

ఈ కార్యక్రమంలో జాతీయ మాల మహానాడు సంఘం మేడ్చల్ జిల్లా కన్వినర్ గుజ్జుక పరుశురాం,దమ్మాయిగూడ మున్సిపల్ అధ్యక్షులు అరిగ నాగరాజు,ఆర్ జి కె కాలనీ డెవలప్మెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ కమిటీ ఉపాధ్యక్షులు రాజేంద్రప్రసాద్,ఆర్ జి కె కాలనీ డెవలప్మెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ కమిటీ ఆర్గనైజింగ్ సెక్రెటరీ,ఆర్ జి కే కాలనీ మాల సంక్షేమ సంఘం జనరల్ సెక్రటరీ సానాది సాయిబాబ,కాలనీ కమిటీ కార్యనిర్వాహక అధ్యక్షుడు రాధాకృష్ణ, మాల సంఘం కార్యనిర్వాహక అధ్యక్షుడు దుబాయ్ రాజు,మాల సంఘం కమిటీ సభ్యులు కె.వి రావు,గ్యాస్ వెంకటేష్,జనార్ధన్,గాలి శ్రీను,మాల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# మా భూమిని మాకు ఇప్పించండి

- దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి
- విలేకరుల సమావేశంలో బాధితుడు అలవాల కృష్ణయ్య

ఖమ్మం బ్యూరో చీఫ్, తెలంగాణ ముచ్చట్లు:

అన్నదమ్ములుగా ఉమ్మడిగా కొనుక్కున్న భూమిని సాగు చేసుకుంటున్న క్రమంలో తనకు తెలియకుండా ఇతరులకు రిజిస్ట్రేషన్ చేయించడమే కాకుండా దాడి చేసి చంపేందుకు ప్రయత్నం చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అలవాల కృష్ణయ్య కోరారు. ఖమ్మం ప్రెస్ క్లబ్ లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అలవాల కృష్ణయ్య మాట్లాడారు. ఖమ్మం జిల్లా, కల్లూరు మండలం, చెన్నూరు గ్రామానికి చెందిన అలవాల బసవయ్య, అలవాల కృష్ణయ్య అన్నాదమ్ములు. వీరు ఉమ్మడిగా భూమిని కొనుగోలుచేసి సాగు చేసుకుంటున్న క్రమంలో అలవాల బసవయ్య తమ్ముడు కృష్ణయ్య భూమిని తెలియకుండా ఇతరులకు అమ్మినట్టు రిజిస్ట్రేషన్ చేయించడమే కాకుండా తెలిసి అడిగినందుకు తనతో పాటు తన కూతుల్లపై దాడి చేశారని ఆరోపించాడు. ఈ విషయమై స్థానిక కల్లూరు పోలీసులకు ఫిర్యాదు చేసామన్నారు. తన కూతురు ఫిర్యాదు పై కేసు నమోదు చేసి తన ఫిర్యాదును పోలీసులు పట్టించుకోలేదని, ఖమ్మం పోలీస్ కమిషనర్ కు కూడా ఫిర్యాదు చేశానని తెలిపాడు. తన భూమిని అక్రమ ఇతరులకు అమ్మి రిజిస్ట్రేషన్ చేయించడమే కాకుండా తనను చంపేందుకు ప్లాన్ ప్రకారం దాడి చేసి చెయ్యి విరగ్గొట్టారని వారిపై కఠిన చర్యలు తీసుకొని తన భూమిని తనకు ఇప్పించాలని కృష్ణయ్య జిల్లా అధికారులను వేడుకున్నాడు. ఈ విలేకరుల సమావేశంలో కందిమల్ల రత్నకుమారి, బసవయ్య, అలవాల మణి, కందిమల్ల కృష్ణయ్య, గూడ బసవమ్మ తదితరులు పాల్గొన్నారు.






## ఖమ్మం త్రీ టౌన్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన పోలీస్ కమిషనర్

ఖమ్మం బ్యూరో చీఫ్, తెలంగాణ ముచ్చట్లు:

ఖమ్మం త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ ను పోలీస్ కమిషనర్ సునీల్ దత్ సందర్శించారు. సోమవారం పోలీస్ స్టేషన్ కు చేరుకున్న పోలీస్ కమిషనర్ స్టేషన్ నిర్వహణ, పోలీసుల పనితీరు, సెక్టార్ అధికారుల విచారణ నివేదికలు,. సి సి టి ఎన్ ఎస్ అప్లోడ్, జనరల్ డైరీ రికార్డులను పరిసరాలను పరిశీలించారు. పిటిషన్ విచారణలకు సంబంధించి సిబ్బందితో మాట్లాడారు. పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదు అయిన కేసులు, డయల్ 100 కాల్స్ ప్రతిస్పందన సమయం, సస్పెక్ట్ షీట్‌లు, పెండింగ్ కేసులు పరిశీలించారు. స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తూ.. వాహానాల తనిఖీలు ముమ్మరం చేయాలని అన్నారు.



స్టేషన్ హౌస్ మేనేజ్‌మెంట్, పోలీస్ స్టేషన్ నిర్వహణ, సెక్టార్ ఆఫీసర్ల భాధ్యతలు విధిగా అమలు చేయాలని సూచించారు. పెట్రో కార్, బీట్ డ్యూటీ సిబ్బంది ఏవిధమైన విధులు నిర్వహిస్తున్నారు? పాత నేరస్థుల నివాసాలను కదలికలను ఏవిధంగా గుర్తిస్తున్నారో అడిగి తెలుసుకున్నారు.

# ఉద్యాన పంటల పెంపకం తోనే పర్యావరణం మార్పులను తట్టుకోగలం

- తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సర్ డాక్టర్ దండా రాజిరెడ్డి

వనపర్తి, తెలంగాణ ముచ్చట్లు:

వేగంగా దూసుకొస్తున్న పర్యావరణ మార్పులు నేపథ్యంలో ఉద్యాన పంటలను విరివిగా పెంచాలని శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ డాక్టర్ దండా రాజిరెడ్డి అన్నారు. పర్యావరణ మార్పులు, పంటలు సంబంధిత అంశాలపై లోతైన పరిశోధన చేసినందుకుగాను ప్రత్యేక పరిశోధన స్థానం ఏర్పాటు చేసేందుకు కసరత్తు చేస్తున్నట్టు తెలిపారు . తక్కువ నీటితో బాగా దిగుబడి నిచ్చే ఉద్యాన పంటలపై దృష్టి సారించాలన్నారు. వనపర్తి జిల్లా మోజెర్లలోని ఉద్యాన కళాశాలలో పర్యటించిన అనంతరం, అనుబంధంగా ఉన్న మదనాపురంలోని విద్యార్థుల ఉద్యాన బోధన క్షేత్రాన్ని పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ పండ్ల తోట్ల సాగు తో పాటు అంతర పంటలు కచ్చితంగా సాగు చేయాలని, అలాగే ఇంకుడు గుంతలను కచ్చితంగా ఏర్పాటు చేసుకుంటే వర్షాభావ పరిస్థితుల్లో తోటలకు నీటిని అందించవచ్చని పేర్కొన్నారు. మెట్ట ఉద్యాన పంటలైన ఉసిరి, చింత, జామున్, సపోటా, వాక్కాయ, కుంకుడు, దానిమ్మ, సీతాఫలం, మునగ వాటిపై దృష్టి సారించాలని అన్నారు. తక్కువ కాలంలో కోతకొచ్చే కూరగాయలు, ఆకుకూరలు, ఏక వార్షిక రకాలు, ప్రాంతానికి అనువైన ఔషధ మొక్కలను సైతం సాగు చేసుకోవచ్చని తెలిపారు. సకాలంలో కత్తిరింపులు చేయడం, నీటి సంరక్షణ పద్ధతులు చేపట్టడం ముఖ్యమని తెలిపారు. అందుబాటులో స్థానికంగా లభించే వనరులతో మల్చింగ్ ఏర్పాటు చేస్తే తక్కువ నీటితోనే తోటలు ఎండిపోకుండా చూసుకోవచ్చని వైస్ చాన్సలర్ డాక్టర్ రాజిరెడ్డి అన్నారు.ఈ కార్యక్రమంలో వర్సిటీ రిజిస్టర్ డాక్టర్ ఏ.భగవాన్, డీన్ డాక్టర్ చీనా, కన్సల్టెంట్ డాక్టర్ కే. వీరాంజనేయులు, అసోసియేట్ డీన్ డాక్టర్ పిడిగం సైదయ్య, ప్రొఫెసర్లు డాక్టర్ షహనాజ్, డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ శంకర్ స్వామి, డాక్టర్ గౌతమి, డాక్టర్ విద్య, భాస్కర్, నవ్య శ్వేత, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.








## తల్లాడ మండలంలో పలు కుటుంబాలను పరామర్శించిన ఎమ్మెల్యే రాగమయి..

ఖమ్మం బ్యూరో చీఫ్, తెలంగాణ ముచ్చట్లు:

తల్లాడ మండల పరిధిలోని అన్నారుగూడెం,రామచంద్రపురం, మల్లారం గ్రామాల్లో సోమవారం సత్తుపల్లి ఎమ్మెల్యే మట్ట రాగమయి దయానంద్ పర్యటించారు. గ్రామ మాజీ సర్పంచ్ మారెల్లి మల్లికార్జున రావును పరామర్శించారు. అనంతరం రమణ రాఘవయ్య, ఇటీవల మరణించిన శెట్టి లక్ష్మి నారాయణ కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలియజేసారు. రామచంద్రపురం గ్రామంలోకి"శే"లు కందుల శ్రీదేవి దశ దీన కర్మ కార్యక్రమం లో పాల్గొని, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేసారు.

ఈ కార్యక్రమంలో తల్లాడ, అన్నారుగూడెం, కల్లూరు చైర్మన్ భాగం నీరజ ప్రభాకర్ చౌదరి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ దివెల కృష్ణయ్య, గంగాదేవి పాడు సొసైటీ చైర్మన్ తూము వీరభద్రరావు, తాళ్ల జోసెఫ్, తుమ్మలపల్లి రమేష్, దుగ్గదేవర రవీంద్ర, మల్లారం, రామచంద్రపురం, తల్లాడ మండలం కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, మహిళా, యూత్ పాల్గొన్నారు.




## ప్రాంతీయ ఫోరెన్సిక్ సైన్స్ లాబొరేటరీ మొబైల్ ల్యాబ్ వ్యాన్ ప్రారంభించిన పోలీస్ కమిషనర్

ఖమ్మం బ్యూరో చీఫ్, తెలంగాణ ముచ్చట్లు:

నేర పరిశోధనలో కీలకంగా ఉపయోగపడే ఫోరెన్సిక్ సైన్స్ లాబొరేటరీ మొబైల్ ల్యాబ్ వ్యాన్ ను పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ప్రారంభించారు. నేరం జరిగిన ప్రదేశానికి వెళ్లి తక్షణమే పరీక్షలు నిర్వహించేందుకు వీలుగా ఈ వాహనం పూర్తి సదుపాయాలతో కూడిన మొబైల్ ల్యాబ్ గా పనిచేస్తుందని పోలీస్ కమిషనర్ అన్నారు. నేరం జరిగిన ప్రదేశానికి వెళ్లి, ఆయా ప్రదేశంలో లభించిన అన్ని రకాల సాక్ష్యాలను (ఫింగర్‌ప్రింట్స్, రక్తపు నమూనాలు, ఇతర ఆధారాలు) సేకరించి, ప్రాథమిక విశ్లేషణలు చేసే ఈ వాహనం నేర పరిశోధనలో చాలా ముఖ్యమైనదని అన్నారు. కార్యక్రమంలో ఏ ఆర్ ఏసీపీ సుశీల్ సింగ్, డాక్టర్ వి. నాగలక్ష్మి (శాస్త్రీయ అధికారి) కె. సుధాకర్ (శాస్త్రీయ అధికారి) కె. నరసింహ (అసిస్టెంట్ డైరెక్టర్)ఆర్ ఐ కామరాజు, శ్రీశైలం, సురేష్, నాగులుమీరా, పాల్గొన్నారు.

## డ్రంకన్ అండ్ డ్రైవ్ పై ట్రాఫిక్ పోలీసుల స్పెషల్ డ్రైవ్...

- 51 కేసులు నమోదు
- ట్రాఫిక్ సిఐ బెల్లం సత్యనారాయణ

ఖమ్మం బ్యూరో చీఫ్, తెలంగాణ ముచ్చట్లు:

ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో డ్రంకన్ అండ్ డ్రైవ్ పై స్పెషల్ డ్రైవ్ నిర్వహించి 51 కేసులు నమోదు చేసినట్లు ట్రాఫిక్ సీఐ బెల్లం సత్యనారాయణ తెలిపారు. ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాసులు పర్యవేక్షణలో నిర్వహించిన స్పెషల్ డ్రైవ్ లోవాహనదారులు మద్యం సేవించి వాహనాలు నడుపుతున్నట్లు గుర్తించి కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. వాహనాలు నడిపే వారు తప్పకుండ హెల్మెట్ ధరించాలని, మద్యం సేవించి వాహనాలు నడపరాదని, నెంబర్ ప్లేట్ లేకుండా, బుల్లెట్ బైక్స్ కి సైలెన్సర్ మార్చి అధికశబ్దంతో నడపరాదని సూచించారు.

## మాజీ సీఎం శిబు సోరెన్ మరణం పట్ల మాజీ ఎంపీ నామ సంతాపం

ఖమ్మం బ్యూరో చీఫ్, తెలంగాణ ముచ్చట్లు:

జార్ఖండ్ ముక్తి మోర్చా అధినేత, మాజీ ముఖ్యమంత్రి శిబు సోరెన్ మరణం పట్ల బిఆర్ఎస్ మాజీ లోక్ సభ పక్ష నేత, ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. ఒక ఉద్యమ నాయకుడిగా, ప్రజల కోసమే జీవితాన్ని అంకితం చేసిన నాయకుడిగా శిబు సోరెన్ నిలిచారని నామ కొనియాడారు. ఆయన జార్ఖండ్ రాష్ట్ర ఏర్పాటు కోసం చేసిన పోరాటం చరిత్రలో నిలిచిపోతుందని అన్నారు. ఆదివాసీ హక్కుల కోసం దశాబ్దాల పాటు పోరాడిన ఆయన సేవలు మరువలేనివని పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో, శిబు సోరెన్ ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు తన మద్దతు తెలిపారని నామ గుర్తు చేశారు. పేదలకు, వెనుకబడిన వారికి న్యాయం కోసం నిరంతరం కృషి చేశారని, శిబు సోరెన్ ఒక నిజమైన ప్రజానాయకుడని, ప్రజల నాడిని అర్థం చేసుకునే నేతగా కొనియాడుతూ, భారత రాజకీయాల్లో ప్రత్యేక గుర్తింపు పొందిన వ్యక్తి అని నామ తెలిపారు. శిబు సోరెన్ నాయకత్వ లక్షణాలు ప్రతి రాజకీయ నాయకుడికి ఆదర్శమని, ఆయన మరణం జార్ఖండ్ రాష్ట్రానికే కాదు, దేశానికే తీరని లోటు అని పేర్కొన్నారు. అవకాశాల కోసం కాకుండా, ఉద్యమాల కోసం



రాజకీయాల్లోకి వచ్చిన గొప్ప నేత శిబు సోరెన్ అని ఆయన జీవితం, పోరాటం, త్యాగం కొత్త తరానికి ప్రేరణ అని అభిప్రాయపడ్డారు. ప్రజలతో సన్నిహితంగా మమేకమైన నేతలలో ఆయన ముందు వరుసలో ఉండేవారన్నారని, పార్లమెంట్‌లో ఆదివాసీల గొంతుగా నిలిచిన గొప్ప నేత అని కొనియాడారు. ఎనిమిది సార్లు లోక్ సభకు ప్రాతినిధ్యం వహించిన సోరేన్ తో తనకు 15వ లోక్ సభ టీడీపీ పార్లమెంటరీ పార్టీ నేత గా వున్నపుడు ఉన్న రాజకీయ పరిచయాన్ని నామ గుర్తు చేసుకున్నారు. ఆయన మాట్లాడే విధానం, ప్రజల మధ్య తిరిగే తీరు చిరకాలం గుర్తుండిపోతుందని, జీవితాంతం ప్రజల కోసమే జీవించిన నాయకుడు అని అన్నారు. ఆయన మృతి పట్ల తీవ్ర విచారం వ్యక్తం చేసిన నామ, వారి కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. భగవంతుడు ఆయన ఆత్మకు శాంతి కలిగించాలని ప్రార్థించారు.



## సఫిలగూడ చెరువుకు 2 కోట్ల నిధులు మంజూరు చెయ్యాలి

అడిషనల్ కమిషనర్ జ్యోతి కి వినతి
మల్కాజ్గిరి కార్పొరేటర్ శ్రవణ్

మల్కాజ్గిరి, తెలంగాణ ముచ్చట్లు:

మల్కాజ్గిరి కార్పొరేటర్ శ్రవణ్ జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమానికి హాజరు అయ్యి పలువురు అధికారులను కలవడం జరిగింది.ముక్యంగా సఫిలగూడ చెరువు లోకి మురికి నీరు రాకుండా మురికి నీరు శుద్ధికరణ కేంద్రానికి తరలించుటకు నిధులు మంజూరు చెయ్యాలని లేక్స్ అడిషనల్ కమీసినర్ జ్యోతి ని కలిసి వినపత్రాన్ని సమర్పించడం జరిగింది.అంతకు ముందు దీనికి సంబంధించి బుద్ధభవన్ లో ఇరిగేషయిన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నారాయణ తో భేటీ అయ్యి దాదాపు 2 కోట్ల రూపాయలతో అంచనాలను తయారు చేసి జిహెచ్ఎంసి కమీసినర్ కు పంపడం జరిగింది. అదే విధంగా అడిషనల్ కమిషనర్ గీతా రాధిక ని సికింద్రాబాద్ జోన్ కు బడ్జెట్ వెంటనే విడుదల చెయ్యాలని కోరడం జరిగింది.

అదే విధంగా చీఫ్ సిటీ ప్లానర్ రాజేంద్ర ప్రసాద్ నాయక్ ని కలిసి అక్రమ సెల్ టవర్స్ వల్ల ప్రజా ఆరోగ్యం దెబ్బ తింటోందని, వెంటనే ఆపాలని వినతి పత్రాన్ని సమర్పించడం జరిగింది.ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు నందు యాదవ్, మహేష్ ముదిరాజ్, మాధవ్ యాదవ్, నర్సింహా, వెంకటేష్, విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఆశ్రమ పాఠశాలలో విద్యార్థినుల అస్వస్థతపై మాజీ ఎంపీ నామ ఆరా

**ఖమ్మం బ్యూరో చీఫ్, తెలంగాణ ముచ్చట్లు:**

ఖమ్మం జిల్లా కల్లూరు మండలంలో ఉన్న గిరిజన ఆశ్రమ పాఠశాలలో పలువురు బాలికలు సోమవారం ఉదయం అస్వస్థతకు గురయ్యారు. ఈ ఘటనపై బిఆర్ఎస్ మాజీ లోక్ సభ పక్ష నేత, ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు ఆరా తీశారు. విద్యార్థినులు ప్రస్తుతం కల్లూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా, వారి ఆరోగ్య పరిస్థితి పై అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అవసరమైతే మెరుగైన వైద్యం కోసం వారిని జిల్లా కేంద్రానికి తీసుకువెళ్ళి వైద్యం అందించాలన్నారు. గత పదిహేడవ లోక్ సభ సమయంలో తన నిధులు నుండి కేటాయించిన అంబులెన్సు స్థానిక కల్లూరు ప్రభుత్వ హాస్పిటల్లో నే అందుబాటులో ఉందని గుర్తు చేశారు. ఇటువంటి ఘటనలు జరిగిన ప్రతిసారీ ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకుంటున్నట్టు చెబుతూనే, సమస్యల మూలాలను పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. ఆశ్రమ పాఠశాలలు గిరిజన పిల్లలకు విద్య అందించే ముఖ్య కేంద్రాల్లో సరైన పర్యవేక్షణ లేకపోవడం ఆందోళన కలిగిస్తుందన్నారు. విద్యార్థుల ఆహార నాణ్యత, పరిసరాల శుభ్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. ఇటీవల రాష్ట్రంలో జరుగుతున్న వరుస సంఘటనలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయని తెలిపారు. ప్రభుత్వం ఆశ్రమ పాఠశాలల



నిర్వహణపై సమగ్ర సమీక్ష చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థినులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ, వారి తల్లిదండ్రులకు ధైర్యం చెప్పాలని స్థానిక బిఆర్ఎస్ నాయకులతో పాటు అధికారులను కోరారు. ఈ ఘటనపై నిష్పాక్షికంగా విచారణ జరిపి, బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవాలని నామ పేర్కొన్నారు.



# స్టార్మ్ వాటర్ డ్రైన్ పైప్ లైన్ పనులను పర్యవేక్షిస్తున్న కార్పొరేటర్ బన్నాల గీత

**చిల్కానగర్, తెలంగాణ ముచ్చట్లు:**

చిల్కానగర్ డివిజన్లోని బ్యాంక్ కాలనీలో 70 లక్షల రూపాయల వ్యయంతో నిర్మిస్తున్న స్ట్రామ్ వాటర్ డ్రేన్ పైప్ లైన్ పనులను పర్యవేక్షించిన డివిజన్ కార్పొరేటర్ జిహెచ్ఎంసి స్టాండింగ్ కమిటీ మాజీ సభ్యురాలు బన్నాల గీత ప్రవీణ్ ముదిరాజ్ అనంతరం వారు ఇంజనీరింగ్ విభాగం అధికారులతో మాట్లాడుతూ కాంట్రాక్టర్ పనులలో నాణ్యత పాటించే విధంగా మరియు ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని చర్యలు దగ్గరుండి పర్యవేక్షించాలని ఆదేశించడం జరిగింది. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్ సీనియర్ నాయకులు ఎదుల కొండల్ రెడ్డి, కోకొండ జగన్ రామాంజనేయులు, ముద్దం శ్రీనివాస్ యాదవ్ ,శ్యామ్, గడ్డ బాలు ,బంటి గౌడ్ కాలనీ అసోసియేషన్ సభ్యులు గఫూర్, శ్రీనివాస్ ,సందీప్, రమేష్ ,మనోజ్, మొదలగు వారు పాల్గొన్నారు.

# తెలంగాణ స్టేట్ సౌత్‌జోన్ మీట్‌లో గంగారపు ప్రభుదేవ్ అండ్ టీమ్‌కు ప్రథమ బహుమతి

- **ధర్మసాగర్‌కు చెందిన ప్రభుదేవ్ అండర్–16 క్యాటగిరీలో రాష్ట్ర స్థాయిలో ప్రతిభ చాటిన విద్యార్థి**

**హన్మకొండ, తెలంగాణ ముచ్చట్లు:**

జవహర్లాల్ నెహ్రూ స్టేడియం, హన్మకొండలో నిర్వహించిన తెలంగాణ సౌత్ జోన్ రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ మీట్‌లో ధర్మసాగర్ మండల కేంద్రానికి చెందిన గంగారపు ప్రభుదేవ్ అండర్ 16 క్యాటగిరీలో 1000 మీటర్ల మిడ్ రిలే రేసులో తన జట్టు సహచరులతో కలిసి తొలి స్థానం సాధించాడు.

ప్రభుదేవ్ " ఎంఆర్‌పీఎస్ నేత గంగారపు శ్రీనివాస్, ప్రశాంత దంపతుల కుమారుడు 'ప్రస్తుతం హన్మకొండ ఫాతిమానగర్‌లోని



సెయింట్ గాబ్రియేల్ స్కూల్‌లో పదో తరగతి చదువుతున్నారు. ప్రభుదేవ్‌తో పాటు రక్షణ, సందీప్, రోహిత్‌లు కలిసి జట్టుగా ప్రదర్శన ఇస్తూ రాష్ట్ర స్థాయిలో మొట్టమొదటి స్థానం సాధించారు.

విజేతలకు బహుమతులను హనుమకొండ జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ కొదిరిపాక సారంగపాణి, మాజీ క్రీడా కోచ్ గట్టు మహేష్‌బాబు (ప్రస్తుత ఆర్యవైశ్య సంఘం రాష్ట్ర అధ్యక్షుడు) లు అందజేశారు. ప్రభుదేవ్ త్వరలో జాతీయస్థాయి పోటీలో పాల్గొననున్నాడు. రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనబర్చిన ఈ యువ ఆటగాడికి శుభాకాంక్షలు వెల్లువెత్తుతున్నాయి.

# మౌలాలిలో నూతన పోలీస్ స్టేషన్ ఏర్పాటు

- **బాధ్యతలు స్వీకరించిన సీఐ సైదయ్య**
- **స్థలం కేటాయింపు,నిధుల మంజూరులో మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి పాత్ర**

**మౌలాలి, తెలంగాణ ముచ్చట్లు:**

మల్కాజిగిరి నియోజకవర్గంలోని మౌలాలి డివిజన్ లో శాంతి భద్రతల పరిరక్షణను ప్రాధాన్యంగా తీసుకుంటూ నూతన పోలీస్ స్టేషన్‌ను ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ పోలీస్ స్టేషన్‌కి సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా సైదయ్య నియమితులయ్యారు. ఆయన ఇటీవలే తన బాధ్యతలను స్వీకరించారు.

ఈ సందర్భంగా సీఐ సైదయ్య, మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావును మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా శాంతి భద్రతల పరిరక్షణలో బాధ్యతతో పని చేయాలంటూ మైనంపల్లి సూచించారు.

పోలీస్ స్టేషన్ భవనం ఏర్పాటుకు సంబంధించి మైనంపల్లి చర్యలు తీసుకున్నారు. మౌలాలి పరిధిలోని మున్సిపల్ వార్డు కార్యాలయాన్ని తాత్కాలికంగా పోలీస్ స్టేషన్‌గా వినియోగించేందుకు మున్సిపల్ కమిషనర్ ఆర్.వీ. కర్ణన్‌తో చర్చించి అంగీకారం



పొందారు. ఇకపై, కుషాయిగూడ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ప్రక్కన ఖాళీ స్థలంలో శాశ్వత భవన నిర్మాణానికి కోటిన్నర రూపాయలు మంజూరయ్యాయని మైనంపల్లి తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీ పర్యటన అనంతరం, ఆగస్టు 15న శంకుస్థాపన జరగనున్నట్లు పేర్కొన్నారు.

నూతన పోలీస్ స్టేషన్ ఏర్పాటుకు కృషిచేసిన మైనంపల్లికి మౌలాలివాసులు కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో శాంతి భద్రతలకు ప్రధాన ప్రాధాన్యత ఇస్తుండటంపై హర్షం వ్యక్తం చేశారు.







# ఝార్ఖండ్ మాజీ సీఎం శిబూ సొరెన్ కన్నుమూత

- **హేమంత్ సొరెన్ ను దగ్గరకు తీసుకుని ఓదార్చిన ప్రధాని మోదీ**
- **అనారోగ్యంతో ఢిల్లీలోని గంగా రామ్ ఆసుపత్రిలో తుదిశ్వాస**
- **ఆసుపత్రికి వెళ్లి నివాళులర్పించిన ప్రధాని నరేంద్ర మోదీ**
- **హేమంత్ సొరెన్ కు పరామర్శ**

తండ్రి మరణంతో తీవ్ర దుఃఖంలో ఉన్న ఝార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సొరెన్‌ను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పరామర్శించారు. ఆయన్ను ఆత్మీయంగా దగ్గరకు తీసుకుని, భుజం తట్టి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా వారిద్దరి మధ్య భావోద్వేగపూరిత వాతావరణం నెలకొంది. రాజకీయాలకు అతీతంగా ప్రధాని చూపిన ఈ ఆత్మీయత అందరినీ కదిలించింది. ఝార్ఖండ్ ముక్తి మోర్చా (జేఎంఎం) వ్యవస్థాపక అధ్యక్షుడు, రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి శిబూ సొరెన్ సోమవారం కన్నుమూశారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన, ఢిల్లీలోని సర్ గంగా రామ్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. 'గురూజీ'గా పేరుగాంచిన ఆయన మరణంతో ఝార్ఖండ్‌లో విషాదఛాయలు అలుముకున్నాయి.

శిబూ సొరెన్ మరణవార్త తెలియగానే ప్రధాని మోదీ నేరుగా ఆసుపత్రికి చేరుకున్నారు. అక్కడ శిబూ సొరెన్ భౌతికకాయానికి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం, ఆయన కుటుంబ సభ్యులను, ముఖ్యంగా కుమారుడు హేమంత్ సొరెన్‌ను కలిసి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. కన్నీటిపర్యంతమైన హేమంత్‌ను ప్రధాని మోదీ ఆప్యాయంగా దగ్గరకు తీసుకుని ఓదార్చారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ సోషల్ మీడియాలో స్పందిస్తూ.. శిబూ సొరెన్ మరణం తీరని లోటని అన్నారు. గిరిజన వర్గాల సంక్షేమం కోసమే శిబూ సొరెన్ తన జీవితాన్ని అంకితం చేశారని, ఆ సేవలకు ఆయన ఎప్పటికీ గుర్తుండిపోతారని ప్రధాని కొనియాడారు. ఈ క్లిష్ట సమయంలో సొరెన్ కుటుంబానికి, ఆయన అనుచరులకు భగవంతుడు ధైర్యాన్ని ప్రసాదించాలని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు.



# ఎమ్మెల్యేల పై అనర్హత త్వరగా నిర్ణయం తీసుకోవాలని బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు

**మల్కాజ్గిరి, తెలంగాణ ముచ్చట్లు:**

అసెంబ్లీలో ఎమ్మెల్యేల పార్టీ ఫిరాయింపుల అంశం పై సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ ని కలిసేందుకు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలతో అసెంబ్లీకి వెళ్లిన మల్కాజ్గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి. పార్టీ మారిన ఎమ్మెల్యేల అనర్హతపై త్వరగా నిర్ణయం తీసుకోవాలని సుప్రీంకోర్టు ఆదేశాలను పాటించాలని స్పీకర్ కి విజ్ఞప్తి చేయడానికి వెళితే స్పీకర్ అందుబాటులో లేకపోవడంతో గాంధీ విగ్రహానికి వినతి సమర్పించిన బిఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలు.

# పాక్‌లో కొనసాగుతున్న మృత్యుఘోష

- **పాకిస్థాన్‌లో రుతుపవనాల బీభత్సం**
- **140 మంది చిన్నారులు సహా 299 మంది మృతి**
- **700 మందికి పైగా గాయాలు, 1600కు పైగా ఇళ్ల ధ్వంసం**
- **జూన్ 26 నుంచి కొనసాగుతున్న కుండపోత వర్షా లు**
- **పంజాబ్ ప్రావిన్స్‌లో అత్యధికంగా 162 మంది మరణం**

పాకిస్థాన్‌లో రుతుపవనాలు పెను విషాదాన్ని మిగిల్చాయి. జూన్ చివరి వారం నుంచి కురుస్తున్న కుండపోత వర్షాల కారణంగా దేశవ్యాప్తంగా ఇప్పటివరకు 299 మంది ప్రాణాలు కోల్పోగా, వీరిలో 140 మంది చిన్నారులే ఉండటం అందరినీ కలచివేస్తోంది. భారీ వర్షాల వల్ల సంభవించిన ఆకస్మిక వరదలు, కొండచరియలు విరిగిపడటంతో తీవ్రమైన ఆస్తి, ప్రాణ నష్టం సంభవించింది. జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ (ఎన్‌డీఎంఏ) విడుదల చేసిన తాజా గణాంకాల ప్రకారం, మృతుల్లో 140 మంది చిన్నారులతో పాటు 102 మంది పురుషులు, 57 మంది మహిళలు ఉన్నారు. ఈ ప్రకృతి విపత్తులో మరో 715 మంది గాయపడగా, వారిలోనూ 239 మంది చిన్నారులు ఉండటం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది.



వర్షాల ప్రభావం తూర్పు పంజాబ్ ప్రావిన్స్‌పై అత్యధికంగా ఉంది. ఇక్కడ ఒక్కచోటే 162 మంది మృతి చెందారు. దీని తర్వాత ఖైబర్ పఖ్తుంఖ్వాలో 69, సింధ్‌లో 28, బలూచిస్థాన్‌లో 20 మంది చొప్పున ప్రాణాలు కోల్పోయారు. ఈ వరదల కారణంగా 1,676 ఇళ్లు దెబ్బతినగా, వాటిలో 562 ఇళ్లు పూర్తిగా నేలమట్టమయ్యాయి. సుమారు 428 పశువులు కూడా మృత్యువాత పడ్డాయని అధికారులు తెలిపారు. రానున్న రోజుల్లో పరిస్థితి మరింత తీవ్రంగా ఉండే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఆగస్టు 4 నుంచి రుతుపవనాలు మరింత బలపడి దేశంలోని ఉత్తర, మధ్య ప్రాంతాల్లో ఆకస్మిక వరదలు సంభవించవచ్చని అంచనా వేసింది. దీంతో సహాయక బృందాలను, అత్యవసర సేవల విభాగాలను అధికారులు అప్రమత్తం చేశారు.

# శ్రీకృష్ణుడే తొలి మధ్యవర్తి.. బంకి బిహారీ కేసులో సుప్రీంకోర్టు

**న్యూఢిల్లీ:** వృందావన్‌లోని శ్రీ బంకి బిహారీ ఆలయం, ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం మధ్య నెలకొన్న వివాదంపై ఇవాళ సుప్రీంకోర్టు స్పందించింది. శ్రీ కృష్ణ భగవానుడు తొట్టతొలి మధ్యవర్తి అని, ఆయన అడుగుజాడల్లో నడవాలని అత్యున్నత న్యాయస్థానం పేర్కొన్నది. బంకి బిహారీ ఆలయానికి చెందిన 500 కోట్ల నిధులతో రీడెవలప్మెంట్ పనులు చేపట్టాలన్న అంశంపై వివాదం చెలరేగుతున్నది. ఆ కేసులో ఇవాళ సుప్రీంకోర్టు వాదనలు విన్నది. శ్రీ కృష్ణుడు తొలి మీడియేటర్ అని, ఈ సమస్యను మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కరించుకోవాలని కోర్టు సూచించింది. రాష్ట్ర ప్రభుత్వం, ఆలయ ట్రస్టు మధ్య ఉన్న వివాదం పరిష్కారం కోసం కమిటీని ప్రతిపాదిస్తున్నట్లు సుప్రీంకోర్టు తెలిపింది.

ఆలయ నిదులను రహస్య వినియోగించే పద్ధతిని సుప్రీంకోర్టు వ్యతిరేకించింది. ఈ అంశంలో యూపీ సర్కారు వైఖరిని కోర్టు తప్పుపట్టింది. జస్టిస్ సూర్య కాంత్, జస్టిస్ జోయ్‌మాలా బాగ్చి ఈ ప్రతిపాదన చేశారు. ఆలయ నిధులను వాడుకోవాలని మే 15వ తేదీన ఇచ్చిన తీర్పును విత్‌డ్రా చేసుకోవాలని సుప్రీం తెలిపింది. గతంలో ఇచ్చిన తీర్పును రద్దు చేస్తున్నామని కోర్టు చెప్పింది. ట్రస్టీ సభ్యుల్లో మాజీ హైకోర్టు జడ్జీ లేదా సీనియర్ రిటైర్డ్ న్యాయవాది ఉంటారని పేర్కొన్నది. కమిటీ ఆదేశాల మేరకు ఆలయ వ్యవహారాలు కొనసాగుతాయని కోర్టు తెలిపింది. బంకి బిహారీ ఆలయ పునరుద్దరణ కోసం వినియోగించే నిధులపై తాత్కాలిక కమిటీకి అవకాశం ఇవ్వనున్నట్లు కోర్టు వెల్లడిరచింది. బంకి బిహారీ ఆలయాన్ని 1862లో నిర్మించారు. అత్యధిక సంఖ్యలో భక్తులు ఆ ఆలయాన్ని విజిట్ చేస్తుంటారు. షిబాయితీలు ఆ టెంపుల్‌ను మ్యానేజ్ చేస్తున్నారు. వారసత్వ పురోహితులు అక్కడ పూజలు, నిర్వహణ చేస్తున్నారు. 2022 జన్మాష్టమి వేడుకల వేళ తొక్కిసలాట ఘటన జరిగింది. దీంతో అక్కడ ఆలయ పునరుద్దరణ చేపట్టాలని డిమాండ్ వచ్చింది. భక్తుల తాకిడీని తగ్గించేందుకు, రక్షణ చర్యలు చేపట్టేందుకు కార్యాచరణ రూపొందించాలని యూపీ సర్కారును 2023 సెప్టెంబర్‌లో అలహాబాద్ కోర్టు ఆదేశించింది.



# పలహార బండ్ల ఊరేగింపు పాల్గొన్న నెమలి అనిల్ కుమార్

**మల్లాపూర్, తెలంగాణ ముచ్చట్లు:**

మల్లాపూర్ లో బోనాల పండుగ వేడుకలు ఘనంగా జరిగాయి,పలు ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీ అమ్మవారి పలహార బండ్ల ఊరేగింపు కార్యక్రమాల్లో గ్రేటర్ కాంగ్రెస్ సీనియర్ నాయకులు నెమలి అనిల్ కుమార్ ముఖ్య అతిధిగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఓల్డ్ మల్లాపూర్ శాంతి యూత్ క్లబ్ ఎస్వి శశిధర్,మల్లిఖార్జున నగర్ కాలనీలో అసోసియేషన్ అధ్యక్షులు పరమేశ్వర్ రెడ్డి,అన్నపూర్ణ కాలనీలో మాతా యూత్ అసోసియేషన్ సూర్యా ఆధ్వర్యంలో ఫలహారబండి ఊరేగింపు జరిగింది.

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్: బొల్లెపాక రాజేష్ తెలుగు దిన పత్రిక

# సీనియర్ సిటిజన్లకు ఎస్ఎఫ్‌బీల్లో ప్రత్యేక ఆఫర్లు

**ఎఫ్‌డీపై 8.50% వడ్డీ**



రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) వరుస ద్రవ్యసమీక్షల్లో రెపోరేటును తగ్గించిన నేపథ్యంలో దేశంలోని చాలా బ్యాంకులు తమ రుణాలపైనేగాక, ఫిక్స్‌డ్ డిపాజిట్ల (ఎఫ్‌డీ)పైనా వడ్డీరేట్లను తగ్గించేస్తున్నాయి. అయితే ఇప్పటికీ కొన్ని బ్యాంకులు అత్యధికంగా 8 శాతంపైనే ఎఫ్‌డీలకు వడ్డీరేట్లను ఆఫర్ చేస్తున్నాయి. ముఖ్యంగా పలు స్మాల్ ఫైనాన్స్ బ్యాంకు (ఎస్ఎఫ్‌బీ)లు సీనియర్ సిటిజన్లకు 8 శాతం, అంతకంటే ఎక్కువే వార్షిక వడ్డీరేట్లను ఇస్తామంటున్నాయి. కానీ ఈ ప్రత్యేక రేట్లు ఎంపిక చేసిన కాలవ్యవధులకే వర్తిస్తాయి.

ఎస్ఎఫ్‌బీలు డీఐసీజీసీ కిందకు వస్తాయా..? : చాలామంది డిపాజిటర్లు స్మాల్ ఫైనాన్స్ బ్యాంకుల్లో ఎఫ్‌డీలు చేయడానికి సంశయిస్తున్నారిప్పుడు. ఇందుకు కారణం తాము చేసే ఎఫ్‌డీలకు బీమా భరోసా ఉందా? లేదా? అన్న అనుమానమే. అయితే ప్రస్తుత నిబంధనల ప్రకారం.. దేశంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ రంగ బ్యాంకుల మాదిరిగానే స్మాల్ ఫైనాన్స్ బ్యాంకుల్లోనూ రూ.5 లక్షలదాకా ఎఫ్‌డీలకు ఆర్బీఐ అనుబంధ సంస్థ డిపాజిట్ ఇన్సూరెన్స్ అండ్ క్రెడిట్ గ్యారంటీ కార్పొరేషన్ (డీఐసీజీసీ) పూచీకత్తు ఉంటున్నది. దీంతో మదుపరులకు భయం అవసరం లేదనే చెప్పవచ్చు. ఆర్బీఐ పర్యవేక్షణ ఉంటుందా..? : దేశంలోని అన్ని బ్యాంకుల తరహాలోనే స్మాల్ ఫైనాన్స్ బ్యాంకులపైనా ఆర్బీఐ పర్యవేక్షణ ఉంటుంది. వీటికీ ఎస్ఎల్ఆర్, సీఆర్ఆర్ రూల్స్ వర్తిస్తాయి. ఆర్బీఐ ఆదేశాలు, మార్గదర్శకాలను అనుసరించాల్సిందే.

ఎఫ్‌డీలపై టీడీఎస్ రూల్స్ : ఏప్రిల్ 1 నుంచి సీనియర్ సిటిజన్ల ఎఫ్‌డీ లపై టీడీఎస్ నిబంధనల్ని సవరించారు. ఒక ఆర్థిక సంవత్సరంలో ఎఫ్‌డీపై వడ్డీ ఆదాయం లక్ష రూపాయలు దాటితే పన్ను కోతలుంటాయి. సాధారణ ప్రజానీకానికైతే రూ.50వేలు దాటితే టీడీఎస్ ఉంటుంది.

ఉత్కర్ష్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ రెండేండ్ల నుంచి మూడేండ్లదాకా ఉండే ఎఫ్‌డీలపై 8.50 శాతం వార్షిక వడ్డీరేటును ఆఫర్ చేస్తున్నది.

18 నెలల 1,2 రోజుల కాలపరిమితి కలిగిన ఎఫ్‌డీలకు ట్కస్లైస్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ 8.50 శాతం వడ్డీరేటును అందిస్తున్నది.

సూర్యోదయ్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ 5 ఏండ్ల ఎఫ్‌డీపై 8.40 శాతం వడ్డీని కట్టిస్తున్నది.

జన స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ ఏడాది నుంచి మూడేండ్ల కాలపరిమితి కలిగిన ఎఫ్‌డీలపై 8.25 శాతం వడ్డీని చెల్లిస్తున్నది.

1001 రోజుల ఎఫ్‌డీకి యునిటి స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ 8.25 శాతం వరకు వడ్డీరేటును ఇస్తున్నది.

ఈక్విటాస్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ 888 రోజుల ఎఫ్‌డీపై 8.20 శాతం వడ్డీరేటును ఆఫర్ చేస్తున్నది.

444 రోజుల ఎఫ్‌డీపై ఈఎస్ఏఎఫ్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ 8.10 శాతం వడ్డీని అందిస్తున్నది.

ఉజ్జీవన్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ రెండేండ్ల ఎఫ్‌డీపై 8.10 శాతం వడ్డీరేటును ఇస్తామంటున్నది.

రెండేండ్ల 1 రోజు నుంచి మూడేండ్లదాకా చేసే ఎఫ్‌డీలపై ఏయూ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ 7.60 శాతం వడ్డీరేటును చెల్లిస్తున్నది.


# దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు గుడ్‌న్యూస్..!

**◆35 రకాల మందుల ధరలు తగ్గిస్తూ కేంద్రం నిర్ణయం..!**



దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి కేంద్రం భారీ ఊరట కల్పించింది. దేశవ్యాప్తంగా 35 రకాల మందుల ధరలను తగ్గించింది. దేశ ప్రజలకు ప్రజలకు మందులను మరింత అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో, జాతీయ ఔషధ ధరల నియంత్రణ సంస్థ ప్రముఖ ఫార్మాస్యూటికల్ కంపెనీలు విక్రయిస్తున్న 35 ఔషధాల రిటైల్ ధరలను తగ్గించింది. ఈ ఒంటినొప్పులు, గుండెసంబంధిత, మధుమేహం, మానసిక వ్యాధుల చికిత్సకు ఉపయోగించే ఔషధాలపై తగ్గింపు వర్తించనున్నది. దాంతో దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి ఊరట కలుగనున్నది. ఈ మేరకు రసాయనాలుఎరువుల మంత్రిత్వ శాఖ ఈ ఉత్తర్వులను మేరకు జారీ చేసింది. యేసిలోఫెనాక్, పారాసెటమాల్, ట్రైప్సిన్ కైమోట్రిప్సిన్ ఫిక్స్‌డ్‌డోస్ కాంబినేషన్, అమోక్సిసిలిన్‌పొటాషియం క్లావ్యులానేట్, అటోర్వాస్టాటిన్, ఎంపాగ్లిఫ్లోజిన్, సిటాగ్లిప్టిన్, మెట్‌ఫార్మిన్ వంటి మందులున్నాయి. డాక్టర్ రెడ్డీస్ ల్యాబొరేటరీస్ విక్రయించే యేసిలోఫెనాక్‌పారాసెటమాల్‌ట్రైప్సిన్ కైమోట్రిప్సిన్ మాత్ర ధరను రూ.13గా నిర్ణయించింది. క్యాడిలా ఫార్మాస్యూటికల్స్ విక్రయించే అదే ఫార్ములేషన్ ధరను 15.01గా పేర్కొంది. గుండె సంబంధిత వ్యాధులున్నవారు విస్తృతంగా వాడే మెడిసిన్ అయిన అటోర్వాస్టాటిన్ 40 %ఎస్త్ర% ం క్లోపిడొగ్రెల్ 75 %ఎస్త్ర% మాత్రల ధరలను రూ.25.61గా నిర్ణయించింది. చిన్నపిల్లలకు ఉపయోగించే సెఫిక్సిమ్, పారాసెటమాల్ ఓరల్ సస్పెన్షన్స్, విటామిన్ డీ లోపం ఉన్న వారిలో వాడే కోలికాల్సిఫెరాల్ డ్రాప్స్, డైక్లోఫెనాక్ ఇంజెక్షన్ ధర రూ.31.77కి తగ్గించింది. రిటైర్లు, డీలర్లు అందరూ మెడికల్ షాపుల్లో తాజా ధరల జాబితాను స్పష్టంగా ప్రదర్శించాలని ఆదేశించింది. ఎక్కువకు ధరకు ఆయా మందులను విక్రయిస్తే కఠిన చర్యలుంటాయని హెచ్చరించింది. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై ఔషధ ధరల నియంత్రణ ఆర్డినెన్స్ 2013, ఎసెన్షియల్ కమెడిటీస్ యాక్ట్ 1955 ప్రకారం జరిమానాలు విధించనున్నట్లు తెలిపింది. ఆయా మెడిసిన్ల ధరలు మినహాయించామని.. అదనంగా జీఎస్టీని చెల్లించాల్సి ఉంటుందని పేర్కొంది. ఔషధ తయారీ కంపెనీలు కొత్త ధరల జాబితాను ఇంటిగ్రేటెడ్ ఫార్మాస్యూటికల్ డేటాబేస్ మేనేజ్‌మెంట్ సిస్టమ్‌లో అప్‌డేట్ చేసి.. ఎన్‌పీపీఏ, రాష్ట్రాల డ్రగ్ కంట్రోలర్స్‌కు సమర్పించాలని ఆదేశించింది. తాజా ఆదేశాలతో ఆయా ఔషధాలపై ఇప్పటికే ఉన్న ధరల ఉత్తర్వులు రద్దయినట్లు స్పష్టం చేసింది.

# సంక్షోభం దిశగా అమెరికా ఆర్థిక వ్యవస్థ..!



మళ్లీ అధికారంలోకి వస్తే అమెరికాకు స్వర్ణయుగాన్ని తెస్తానంటూ గద్దెనెక్కిన డొనాల్డ్ ట్రంప్.. అగ్రరాజ్యాన్ని అధోగతిపాలు చేస్తున్నారిప్పుడు. దేశ ఆర్థిక వ్యవస్థ సంక్షోభంలోకి జారుకుంటున్న సంకేతాలు వస్తున్నాయి మరి. ట్రంప్ విధానాలు ప్రపంచ దేశాలకే గాక, స్వదేశానికీ ఇబ్బందికరంగా పరిణమిస్తున్నాయి. ఎదురు తిరిగితే ఏ దేశంపైనైనా ప్రతీకార సుంకాలతో విరుచుకుపడిపోతున్న ట్రంప్.. దీనివల్ల సొంత దేశంపై ఏ రకమైన ప్రభావం పడుతున్నదో చూసుకోవట్లేదు. ఫలితంగా స్వజాతీయుల నుంచే విమర్శల్ని మూటగట్టుకుంటున్నారు.

'మేక్ అమెరికా గ్రేట్ అగైన్' అంటూ మరోసారి అధ్యక్ష పీఠాన్ని అధిరోహించిన డొనాల్డ్ ట్రంప్.. అధికారంలోకి వచ్చిన దగ్గర్నుంచి అనుసరిస్తున్న విధానాలు, తీసుకుంటున్న నిర్ణయాలు అగ్రరాజ్యాన్ని అబాసుపాలు చేస్తున్నాయి. 'పెద్దన్న'గా ప్రపంచ ఆర్థిక వ్యవస్థను బలపర్చాల్సిందిపోయి.. ప్రతీకార సుంకాలతో రగిలిపోతూ బలహీనపరుస్తున్నారు మరి. నిరుడుతో పోల్చితే తగ్గిన ఉద్యోగాలు, పెరిగిన ద్రవ్యోల్బణం, మందగిస్తున్న జీడీపీ ఇదీ.. ఆ దేశంలో ఇప్పుడు నెలకొన్న దుస్థితి. అవును.. అమెరికా అధ్యక్షుడిగా బాధ్యతల్లోకి వచ్చి కేవలం ఆరున్నర నెలలే కావస్తున్నా.. టారిఫ్‌ల పెంపు, కొత్త పన్ను విధానం, ఖర్చుల కారణంగా అక్కడి వాణిజ్య, తయారీ, ఇంధన రంగాలు సమస్యలను ఎదుర్కొంటున్నాయి.

**ట్రంపరితనంతో..** : జూలైలో ఉద్యోగ గణాంకాలు తగ్గిపోవడంపట్ల ట్రంప్ తీవ్రంగా స్పందించారు. సదరు డాటాను ఇచ్చిన బ్యూరో ఆఫ్ లేబర్ స్టాటిస్టిక్స్ (బీఎల్ఎస్) డైరెక్టర్ ఎరికా మెక్‌ఎంటర్‌ఫర్‌ను తొలగించేశారు. ఎరికా.. బైడెన్ హయాంలో వచ్చినవారని, అందుకే రాజకీయంగా తనను అప్రతిష్టపాలు చేసేందుకు ఈ తప్పుడు గణాంకాలిచ్చారని ట్రంప్ మండిపడ్డారు.

రష్యా చమురు ఆగలేదు : 'తమ ఒత్తిళ్లకు తలొగ్గిన భారత్.. రష్యా నుంచి చమురు కొనుగోళ్లను ఆపేసిందని తెలుస్తున్నది. ఇదే నిజమైతే అది మంచి నిర్ణయం' అని ట్రంప్ శనివారం చేసిన వ్యాఖ్యలను కేంద్ర ప్రభుత్వం ఖండిరచింది. రష్యా నుంచి చమురు దిగుమతులు ఆగినట్టు తమకైతే తెలియదని విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రకటించింది.

**ఆ రంగాల్లో రాయితీ వద్దు** : అమెరికాతో ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందానికి చర్చలు జరుపుతున్న కేంద్ర ప్రభుత్వం.. వ్యవసాయం, పాడి, జెనెటికల్లీ మోడిఫైడ్ (జీఎం) ఫుడ్స్‌పై విధిస్తున్న సుంకాల్లో రాయితీలకు దిగితే ప్రమాదమని నిపుణులు హెచ్చరిస్తున్నారు. అమెరికా ఈ రంగాల్లోని వస్తూత్పత్తులపైనా సుంకాలను తగ్గించాలని పట్టుబడుతున్నది. అయితే అమెరికాలో కార్పొరేట్ల చేతిలో ఉన్న వ్యవసాయ, పాడి, జీఎం ఫుడ్స్ రంగాలు.. భారత్‌లో మాత్రం వ్యక్తిగతంగా రైతుల చేతుల్లోనే ఉన్నాయని వారు చెప్తున్నారు. దీంతో సుంకాల్లో రాయితీకి అంగీకరిస్తే.. కుప్పలు తెప్పలుగా విదేశాల నుంచి దేశీయ మార్కెట్‌లోకి ఆయా వస్తూత్పత్తులు వస్తాయని, ఇదే జరిగితే దేశీయ మార్కెట్‌లో ధరలు పడిపోయి, ఇక్కడ వాటిపై ఆధారపడిన రైతులు, ఉద్యోగులు రోడ్డునపడే దుస్థితి నెలకొంటుందని పేర్కొంటున్నారు.

**ద్వైపాక్షిక వాణిజ్యం..** : ఇక 2030 నాటికి ద్వైపాక్షిక వాణిజ్యం 500 బిలియన్ డాలర్లకు చేరాలన్న లక్ష్యంతో అమెరికాభారత్‌లు ఒప్పందానికి దిగుతున్నాయి. ప్రస్తుతం ఇది 190 బిలియన్ డాలర్లే. కాగా, ఆటోమొబైల్స్, ఎలక్ట్రిక్ వెహికిల్స్, వైన్స్, పెట్రోకెమికల్ ఉత్పత్తులు, వ్యవసాయం, పాల ఉత్పత్తులు, యాపిల్స్, ట్రీ నట్స్, జీఎం ఫుడ్స్ పంటలపై సుంకాల్లో భారత్ నుంచి అమెరికా రాయితీలను ఆశిస్తున్నది. మరోవైపు ఇప్పుడు విధించిన 25 శాతం అదనపు టారిఫ్‌తోపాటు ఉక్కు, అల్యూమినియంపై వేసిన 50 శాతం, ఆటో రంగంపై విధించిన 25 శాతం సుంకాలను తొలగించాలని అమెరికాను భారత్ కోరుతున్నది. అలాగే దేశంలో ఎక్కువమందికి జీవనాధారంగా ఉన్న టెక్స్‌టైల్స్, రత్నాలుఆభరణాలు, తోలు ఉత్పత్తులు, దుస్తులు, ప్లాస్టిక్స్, రసాయనాలు, రొయ్యలు, నూనె గింజలు, ద్రాక్ష, అరటిపై సుంకాలు వద్దంటున్నది.

**ఆటోమోటివ్, టైర్ ఇండస్ట్రీకి దెబ్బ** : ఆసియాలోని ఆయా దేశాలతో పోల్చితే భారత్ నుంచి అమెరికాకు వస్తున్న ఆటోమోటివ్, టైర్ ఇండస్ట్రీస్ ఎగుమతులపై ట్రంప్ వేసిన సుంకాలు ఎక్కువగా ఉండటం గమనార్హం. ఈ రంగాల్లో అంతర్జాతీయ మార్కెట్‌లో భారత్‌కు గట్టి పోటీనిస్తున్న జపాన్, వియత్నాం, ఇండోనేషియా తదితర దేశాలపై ట్రంప్ తక్కువ సుంకాలనే వేశారని రేటింగ్ ఏజెన్సీ ఇక్రా చెప్తున్నది. ఆటో విడిభాగాలపై 27 శాతం, టైర్లపై 17 శాతం టారిఫ్‌లు పడుతున్నాయి. దీంతో ఆయా పరిశ్రమలు ఇప్పు డు తీవ్ర ఆందోళనకు గురవుతున్నాయి. టారిఫ్‌లు తగ్గకపోతే ఇండస్ట్రీ ఎగుమతులు పడిపోయే వీలుందని హెచ్చరిస్తున్నాయి. 202425లో భారతీయ ఆటోకంపొనెంట్స్ ఇండస్ట్రీ టర్నోవర్ 80.2 బిలియన్ డాలర్లు (రూ.6.73 లక్షల కోట్లు)గా ఉన్నది.

**ప్రస్తుతం టారిఫ్‌లు ఎంత..?** : భారత్‌లో దిగుమతి సుంకాల సగటు దాదాపు 17 శాతంగా ఉంటే, అమెరికాలో ఇది 3.3 శాతంగా ఉన్నది. అయితే ఈ ఏడాది ఏప్రిల్ 2న భారత్‌పై 26 శాతం (16 శాతం ప్రతీకార సుంకం, 10 శాతం కనీస సుంకం) అదనపు సుంకాలను ట్రంప్ విధించారు. కానీ ఇటీవలే దాన్ని 25 శాతానికి మార్చారు. ఇది ఈ నెల 7 నుంచి అమల్లోకి రానున్నది. ప్రస్తుతానికైతే అమెరికాకు ఎగుమతి అవుతున్న భారతీయ వస్తూత్పత్తులపై అదనంగా 10 శాతం కనీస సుంకమే పడుతున్నది. 7 తేదీ నుంచి ఈ 10 శాతం స్థానంలో 25 శాతం వచ్చి చేరుతుంది. ఉదాహరణకు భారతీయ టెక్స్‌టైల్స్‌పై అమెరికాలో 69 శాతం సుంకాలుండేవి. కనీస సుంకంతో 1619కి చేరాయి. ఆగస్టు 7 నుంచి 3134 శాతానికి వెళ్తాయి. ఇదీ సంగతి..

**ఉద్యోగాలు** : కొత్త కొలువులు జూలైలో 73వేలకే పరిమితమయ్యా యి. గత ఏడాది సగటున ఒక్కో నెల 1.68 లక్షల ఉద్యోగాలు రావడం విశేషం. టారిఫ్‌లు, పెరిగిన ధరలే ఇందుకు కారణం. టారిఫ్‌లు ప్రకటించిన దగ్గర్నుంచి తయారీ రంగంలో 37వేల ఉద్యోగాలు పోయాయి. పెట్టుబడులు, వినిమయం నీరసించిపోవడంతో ఉద్యోగఉపాధి అవకాశాలు సన్నగిల్లాయని చెప్తున్నారు.

**జీడీపీ** : అమెరికా జీడీపీ ఈ జనవరిమార్చిలో మైనస్ 0.3 శాతంగా నమోదైంది. నిరుడు అక్టోబర్‌డిసెంబర్‌లో 2.4 శాతంగా ఉన్నది. ఇక ఏడాది మొత్తానికున్న అంచనాలూ 2.2 శాతానికి పరిమితమవుతున్నాయి. దిగుమతులు మైనస్ 5 శాతానికి పడిపోవడం మార్కెట్ పరిస్థితులకు అద్దం పడుతున్నది.

**ద్రవ్యోల్బణం** : ఏడాది కిందటితో పోల్చితే జూన్‌లో ద్రవ్యోల్బణం 2.6 శాతానికి ఎగిసింది. మే నెలలో 2.4 శాతంగా ఉన్నది. ఫెడరల్ రిజర్వ్ బ్యాంక్ ఆమోదయోగ్య స్థాయి 2 శాతమే. కాబట్టే ట్రంప్ ఎంత ఒత్తిడి తెచ్చినా కీలక వడ్డీరేటును 4.3 శాతం వద్దే ఫెడ్ రిజర్వ్ ఉంచుతున్నది. దీంతో ఫెడ్ చీఫ్‌కు, ట్రంప్‌కు మధ్య విభేదాలు కూడా నెలకొన్నాయి.



# సైబర్ మోసాలతో ఆందోళన..! నిపుణుల జాగ్రత్తలు..

ఇటీవలికాలంలో సైబర్ మోసాలబారినపడి ఎందరో నష్టపోతున్నారు. చదువురాని అమాయకుల సంగతి అటుంచితే.. ఉన్నత విద్యనభ్యసించినవారూ సైబర్ నేరగాళ్ల వలలో పడుతుండటం ఆందోళన కలిగిస్తున్నది. మరి నిపుణులు సూచిస్తున్న జాగ్రత్త లేంటో తెలుసా..?

మొబైల్/ఇంటర్నెట్ బ్యాంకింగ్ పాస్‌వర్డ్‌లను ఎవరితోనూ పంచుకోవద్దు. ఒకవేళ తప్పనిసరి పరిస్థితుల్లో కుటుంబ సభ్యులు, బంధువులు, మిత్రులకు చెప్పాల్సి వస్తే.. సదరు లావాదేవీ పూర్తయిన వెంటనే కొత్త పాస్‌వర్డ్‌ను మార్చుకోవాలి.

అత్యంత క్లిష్టతరంగా, ఎవరి ఊహలకు అందనివిధంగా ఈ పాస్‌వర్డ్‌ల నిర్మాణం ఉంటే మంచిది. డిక్షనరీ వర్డ్స్‌ను వాడటం వల్ల పాస్‌వర్డ్‌లను సైబర్ మోసగాళ్లు ఊహించే వీలున్నది.

మాతృ భాషకు చెందిన అక్షరాలు లేదా మీకు మాత్రమే తెలిసిన తేదీలు, రకరకాల చిహ్నాలను పెట్టుకోవాలి. అప్పుడే డీ కోడిరగ్‌కు కష్టమవుతుంది.

ప్రతీ 3 లేదా 6 నెలలకోసారి పాస్‌వర్డ్‌లను మారిస్తే ఉత్తమం. సుదీర్ఘకాలంపాటు ఒకే పాస్‌వర్డ్‌ను వాడటం వల్ల సైబర్ మోసగాళ్లబారినపడే ప్రమాదం పొంచి ఉంటుంది.

కనీసం 16 అక్షరాలతో పాస్‌వర్డ్ ఉండాలి. పాస్‌వర్డ్ ఎంత పెద్దదైతే దాన్ని కనిపెట్టడం మోసగాళ్లకు అంత కష్టమవుతుంది.

ఉచిత వైఫైలను వాడరాదు. ఎయిర్‌పోర్ట్, రైల్వే స్టేషన్, హోటళ్లలో ఫ్రీగా వస్తుందని ఉపయోగిస్తే మీ ఇంటర్నెట్ బ్రౌజింగ్ ఇతరులకు తెలిసే వీలున్నది. అలాగే ఈ సమయంలో ఆర్థిక లావాదేవీలను అస్సలు జరుపవద్దు. దీనివల్ల మన పిన్ నెంబర్లను హ్యాకర్స్ సులభంగా పసిగట్టగలరు.

పాస్‌వర్డ్‌లను మొబైల్ ఫోన్లలో సేవ్ చేసుకోవద్దు. ఫోన్ హ్యాక్ అయినప్పుడు అందులోని విలువైన డాటా కూడా దొంగతనానికి గురవుతుంది.




# కో-బ్రాండెడ్ క్రెడిట్ కార్డులు..!

ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ దిగ్గజం ఎస్బీఐ అనుబంధ సంస్థ ఎస్బీఐ కార్డ్, ప్రముఖ డిజిటల్ పేమెంట్స్ యాప్ ఫోన్‌పే కలిసి కోబ్రాండెడ్ క్రెడిట్ కార్డులను తీసుకొచ్చాయి. సెలెక్ట్ బ్లాక్, పర్పుల్ పేరిట రెండు వేరియంట్లలో ఇవి పరిచయమయ్యాయి. ఇవి రూపే, వీసా నెట్‌వర్క్‌లపై పనిచేస్తాయి. రూపే వెర్షన్‌ను యూపీఐకీ లింక్ చేసుకోవచ్చు. ఫోన్‌పే ఈగిఫ్ట్ వోచర్లుగా సెలెక్ట్ బ్లాక్‌పై రూ.1,500, పర్పుల్‌పై రూ.500 అందుకోవచ్చు. అంతేగాక బ్లాక్ కార్డు వినియోగదారులు ఏటా చేసే ఖర్చులు రూ.5 లక్షలుగా ఉంటే రూ.5 వేల ట్రావెల్ వోచర్, పర్పుల్ కార్డుదారులు ఏటా ఖర్చు రూ.3 లక్షలుగా ఉంటే రూ.3 వేల ట్రావెల్ వోచర్ పొందవచ్చు. ఫోన్‌పే యాప్ ద్వారా ఈ కార్డుల కోసం దరఖాస్తు చేసుకొనే వీలున్నది. బిల్లులనూ నేరుగా చెల్లించవచ్చు. కస్టమర్లకు ప్రతిరోజూ చేసే కిరాణా, ట్రావెల్ బుకింగ్స్, బీమా ప్రీమియంలు తదితర ఖర్చులపై రివార్డు పాయింట్లూ వస్తాయి. సెలెక్ట్ బ్లాక్ కార్డ్ ద్వారా ఫోన్‌పే యాప్‌పై కొనుగోలు లావాదేవీలు జరిపినప్పుడు 10 శాతం వరకు వాల్యూ బ్యాక్ ఆఫర్ అందుకోవచ్చు. ఆన్‌లైన్ షాపింగ్‌పైనా 5 శాతం వరకు ప్రయోజనాలుంటాయి.

# క్యాప్‌జెమినీలో 45 వేల ఉద్యోగాలు

దేశీయ ఐటీ దిగ్గజాలు ఒకవైపు వేలాది మంది సిబ్బందిని తొలగిస్తున్న ప్రస్తుత తరుణంలో క్యాప్‌జెమినీ భారీ స్థాయిలో ఉద్యోగులను నియమించుకోవడానికి సిద్ధమైంది. ప్రస్తుత సంవత్సరంలో 45 వేల మంది సిబ్బందిని రిక్రూట్ చేసుకోనున్నట్టు, కృత్రిమ మేధస్సుపై ప్రత్యేక దృష్టి సారించడానికి ఈ నిర్ణయం తీసుకున్నట్టు కంపెనీ సీఈవో అశ్విన్ యార్ది తెలిపారు. ప్రస్తుతం సంస్థకు భారత్‌లో 1.75 లక్షల మంది సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. నిర్వహణ ఖర్చులు తగ్గించుకోవడానికి క్లయింట్లు అధిక ప్రాధాన్యతనివ్వడంతోపాటు సామర్థ్యాన్ని మెరుగుపరుచుకోవడానికి పెద్దపీట వేస్తున్నట్టు చెప్పారు. ఈ ఏడాది దేశీయంగా 50 కళాశాల నుంచి వీరిని తీసుకోనున్నట్టు ఆయన ప్రకటించారు.




టాటా ఇన్‌స్టిట్యూట్‌తో ఏజిలెంట్ జట్టు : టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రీసర్చ్(టీఐఎఫ్ఆర్)తో వ్యూహాత్మక కీలక ఒప్పందాన్ని కుదుర్చుకున్నట్టు ఏజిలెంట్ టెక్నాలజీ సంస్థ ప్రకటించింది. న్యూట్రిషన్, మెటబాలిజం పరిశోధన విభాగాన్ని మరింత బలోపేతం చేయాలనే ఉద్దేశంతో ఈ ఒప్పందాన్ని కుదుర్చుకున్నట్టు కంపెనీకి చెందిన వర్గాలు వెల్లడిరచాయి.

Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar, Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2023/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in